


# ప్రముఖాంధ్ర

**ప్రపంచ తెలుగుల మానస పత్రిక**

సెప్టెంబర్ 2019

సంపుటి : 25 **297** సంచిక : 9




## మనం మనల్ని గుర్తు చేసుకోవాల్సిన దౌర్భాగ్యస్థితిలో వున్నాం!!

రెండు వందల సంవత్సరాలు పాలించిన ఆంగ్లేయుల దౌష్ట్య పాలనం నుంచి బయటపడి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందిన మనం అర్థ శతాబ్ది తరువాత కూడా అయోమయ స్థితిలో వున్నాం. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులందరూ తరతమ బేధాలను సృష్టించుకుంటున్నాం. ఒకరినొకరు ద్వేషించుకుంటున్నాం. రాజకీయ పార్టీలు విజృంభణ దశకు పరుగెడ్తూ, నీవు కాంగ్రెసువు, నేను కమ్యూనిస్టును, లేదా బిజెపిని మరొకటి అంటూ అసెంబ్లీలోనూ, లోక్‌సభ, రాజ్యసభల్లోనూ ఇంటా బయటా కొట్టకుని చస్తున్నాం. అంతేగానీ అందరమూ భారతీయులమనే ఏకాభిప్రాయం ఏకోశానా కలగడం లేదు సరికదా, దేశాన్ని దోచుకుని తినడం, పదవీ వ్యామోహం కోసం కొట్టుమిట్టులాడడమే ప్రధానంగా జరుగుతున్నది. పైనున్న (పదవిలో) వాణ్ణి ఎలా కిందకి దిగి లాగాలా అన్నదే యోచన తప్ప, ప్రజాశ్రేయస్సు వారి యోచన కాదు.

మన దేశం గూర్చి, మన చరిత్ర గూర్చి మన శక్తిని గూర్చి, మన సఖ్యతను గూర్చి చెప్పుకోవలసివస్తూన్నది. అలనాడు కళారూపాల్లో శ్రీఅయ్యంకి వెంకటకృష్ణయ్యగారు దేశభక్తిని నూరిపోస్తూ చెప్పిన 'నందనా గీతం' గుర్తుకు వస్తున్నది.

**మనది భారతదేశమమ్మా,**
**మనది భారతజాతి తల్లీ**
**భారతీయులము మనమమ్మా!**
**బానిసలమైనాము తల్లీ**

(ఇపుడూ మనం బానిసలమే! ప్రజాస్వామ్యంలో సౌమ్యత్వం క్షీణించి, రిజర్వేషన్లతో నలిగిపోతున్నాం)

**మన బాలచంద్రుడూ**
**మన ఖడ్గతిక్కనా**
**మన్యపు వీరులూ**
**మన రెడ్డి రాజులూ**
**తమ శౌర్యమయ రక్త**
**ధారా స్రవంతిలో**
**తడిసి మెరిసిన వీర**
**ధాత్రి ఇది మా తల్లి-**
**మనది భరతదేశమమ్మా!-**

-అంటూ పిల్లలకు పాఠం చెప్పినట్లు ఏ నేతయైనా దివి నుంచి భువికి దిగి వచ్చి చెబితే 'అందరమూ ఒక్కటే- అందరమూ భారతీయులమే' మతం లేదు, కులం లేదు, పార్టీ లేదు, గీర్టీ లేదు అంటూ అందరూ ఒక్కటియై, దేశాన్ని బంగారు బాటపై నడిపించకలుగుతారేమోననిపిస్తూంది. ఇపుడున్న ఏ పార్టీలోనూ సిద్ధాంతాలు లేనందున, రాద్ధాంతాలు పెరిగి, పాలన అస్తవ్యస్తమవుతూన్నది. కొత్తగా పార్టీ రహిత రాజ్యాంగం రావాలి. ఇప్పుడున్న దేశవాళీ దొంగనాయకులందర్నీ ఇళ్ళకుగానీ, జైళ్ళకుగానీ పంపాలి. ఈ సాహసపు ప్రక్షాళనా చర్య చేబట్టనంత వరకూ 'భారతీయులమైన మనము బానలసమే తల్లీ భారతమాతా, ఇంకా దౌర్భాగ్య స్థితిలోనే ఉన్నాము తల్లీ' అంటూ పాడుకోవలసిందే!



*బుధజన విధేయుడు*

*- గోటేటి శ్రీరామారావు*

**(మే 2001 ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# వేదజ్ఞానపరంగా వినాయకుడు

**గజాననం భూత గణాధి సేవితం**
**కపిత్థ జంబూ ఫలసారభక్షణమ్ ।**
**ఉమాసుతం శోకవినాశకారణం**
**నమామి విఘ్నేశ్వర పాద పంకజమ్ ॥**

గణపతి! వినాయకుడు! విఘ్నేశ్వరుడు! ఇలాంటి పేర్లు వినేసరికి కాశ్మీరు నుంచి కన్యాకుమారిదాకా ఏ మనిషికీ కొత్త అనిపించదు. అతడు ఏ మతంవాడైనా సరే, అతని మనస్సుకు "ఈ దేవుడ్ని గురించి ఎంతో కొంత నాకు తెలుసు' అన్న భావమే కలుగుతుంది. అందుకే, భారతదేశంలో ఉత్తర దక్షిణాల్లోనూ, ప్రాక్పశ్చిమాల్లోనూ, సమమైన ఆవేశంతో ప్రజలు సమావేశమై జరుపుకునే పెద్ద పండగల్లో "వినాయక చవితి" మొట్టమొదటిది, **వినాయక చవితి :**

ఇంతకూ వినాయకుడికీ, భాద్రపద శుద్ధ చవితికీ, సంబంధమేమిటి? ఆ రోజే ఆయనను అంత పెద్దగా పూజించవలసిన అవసరమేమిటి?

*బ్రహ్మశ్రీ కుప్పా వేంకటకృష్ణమూర్తిగారు అవధూత పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆస్థానపండితులు, 'భక్తిమాల' సంపాదకులు. అపర అగస్త్యులు, ఇంకనూ విపులీకరించాలంటే రఘువంశ కులగురువులైన వశిష్ఠులు వంటి విద్వాంసులూ, విద్వద్వైములు. **I.SERVE** సంస్థ ద్వారా వేద విజ్ఞానాన్ని పరిశోధన చేస్తున్నారు. శాస్త్రపరంగా సమస్తమూ విశదీకరించాలనేదిది వారి అభిమతంగా కనిపిస్తున్నది. తొలిగా వారు గణనాధుని విషయంగా చేసిన విశ్లేషణ నిందు పొందుపరుస్తున్నాం . – 'గోటేటి'*

ఈ ప్రశ్నకు ఒక్కరూ ఒక్కొక్క సమాధానం చెబుతున్నారు.

అది ఆయన పుట్టిన రోజు. అందువల్ల ఆ రోజు ఆయనకు ముఖ్యం! – ఇదొక సమాధానం. ఇది కొంతమంది ప్రజలకు కొంతవరకు తృప్తినిచ్చింది. కానీ, క్రమంగా ప్రజలలో తార్కిక దృష్టి పెరిగినకొద్దీ, ఈ సమాధానం చాలక, వేరే సమాధానం కోసం అన్వేషణ పెరిగింది.

భాద్రపద శుద్ధం అంటే వర్ష ఋతువుకు మధ్యభాగం. అప్పటికి ఊళ్లల్లో చెట్లన్నీ బాగా కాచి, పూచి, వుంటాయి. రైతులకు పొలాల్లో నాట్లు వగైరా పనులు పూర్తయి, కొంచెం ఖాళీగా ఉంటారు. కనుక ఈ సమయంలో ప్రకృతి మనకిచ్చిన మంచి ఓషధీ పత్రాలన్నీ ఒకచోటుకు చేర్చి, తద్వారా గ్రామాల్లో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు వినాయక చవితి వ్రతాన్ని ఏర్పాటు చేసి, దాంట్లో ఏకవింశతి పత్ర పూజ, (21 రకాల ఆకులతో పూజ) ద్వారా పూజ (గరికతో పూజ) మొదలైన వన్నీ ఏర్పాటు చేశారు!– ఇది మరో సమాధానం.

దీంట్లో కొంచెం సైన్సు, కొంచెం సెంటిమెంటు, కలిసిపోయి వున్నాయి. ఇది కొంత తృప్తినిస్తోంది. కానీ, కొంత మాత్రమే! "జరిగే పూజను చూసి, మీరు మీ మేధాశక్తిని ఉపయోగించి, సమన్వయం చేస్తున్నారే గాని, ఈ పూజ ఇందుకోసమే – అని ఎక్కడైనా పాత గ్రంథాల్లో ప్రమాణవాక్యం వుందా?– అనే ప్రశ్న అలాగే మిగిలిపోయి వుంటోందిగదా – అని ప్రశ్నిస్తోంది యువహృదయం.

ఔను నిజమే! ఈ రోజుల్లో ఈ ప్రశ్న అలా మిగిలిపోయే వుంటోంది. దానికి కారణ మేమంటే, మీరన్నారే – ఆ పాత గ్రంథాలు, అంటే, వేదాలు, ఆగమాలు, పురాణాలు, వగైరాల అధ్యయనం ఈనాటి సమాజంలో లోపించి వుంది. అది లోపించటంవల్ల, పెద్దవాళ్లెవరో చెప్పినది విని, నమ్మేసి, చేసుకుపోవలసిన పరిస్థితి వచ్చింది. ఆ అధ్యయనం సమాజంలో సమృద్ధిగా వున్న రోజుల్లో, అలా కేవల విశ్వాసంమీద ఆధారపడి నడవ వలసిన అవసరం వుండేది కాదు. కనుక మనం గూడా ఇప్పుడు "ఆ పాత గ్రంథాల్లో" ఏముందో స్వయంగా చూడటం నేర్చుకోవాలి,

ఈ లక్ష్యంతోనే జగద్గురువులైన శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆజ్ఞవల్ల అనేకమంది పండితులు, ప్రొఫెసర్లు, సైంటిస్టులు అందరూ I-S.E.R.V.E సంస్థ ద్వారా అద్భుతమైన రీసర్చ్ చేస్తున్నారు. ఆ పరిశోధన ఫలితాలను మనం అందరం పంచుకోవాలి. ఆ అమృతాన్ని మనం అందరం అందుకోవాలి.

ఈ విషయంలో మనమేమీ మైళ్లకు మైళ్లు తవ్వకాలు చేసి, చారిత్రక సాక్ష్యాలకోసం కసరత్తులు చేయనక్కరలేదు. ప్రపంచం మొత్తంమీద అతి పురాతన సాహిత్యంగా గుర్తింపు పొందిన వేదం ఏం చెపుతోందో వింటే చాలు.

పండుగలను నిర్ణయించే సూత్రం–

**ప్రాతర్యవాణా ప్రథమా యజధ్వమ్।**
**నో రసనా మయన్తి దేవా యా అజుష్టమ్ ॥**

ఇది ఒక ఋగ్వేద మంత్రం "సూర్యుడు ఉదయించ డానికిముందు తూర్పు దిక్కున ఏ నక్షత్రం ఉదయిస్తుందో, ఆ నక్షత్రానికి నంబంధించిన దేవతను ఆనాడు పూజించండి. లేదా, సూర్యాస్తమయంకాగానే ఉదయించే నక్షత్రానికి సంబం ధించిన దేవతను ఆనాడు పూజించండి" అని దీనికి అర్థం.

ఇది వేదం ఇచ్చిన వైజ్ఞానిక సూత్రం. దీన్ని ఆచరణలో పెట్టాలంటే, మనకు ఏ రోజు సూర్యోదయ సూర్యాస్తమయాలకు ఆకాశంలో ఏ నక్షత్రాలు ఉదయిస్తాయో ముందే తెలియాలి. ఇది తెలియాలంటే, అపారమైన ఖగోళ విజ్ఞానం (Astronomical Knowlege) వుండాలి. ఇది మన పూర్వీకులకు ఇప్పటికన్నా సమృద్ధిగా వుంది. కాని అది చాలదు. ఉదయించిన ఆ నక్షత్రానికీ, దేవతకూ సంబంధమేమిటో తెలియాలి.

ఈ సంబంధాన్ని ఎవరు కల్పిస్తారు? ఎవరు నిర్ణయిస్తారు? ఎవరు ఆమోదిస్తారు? పురాణ కర్తలైన మతాధిపతులా? వారి అనుయాయులా? కానేకాదు. ఆ సంబంధాన్ని కేవలం ప్రకృతే నిర్ణయిస్తుంది. ఈ విషయానికి మన ప్రధాన

దేవతా మూర్తులన్నీ సాక్ష్యంగా నిలబడగలవు. అయినా, ఆది పూజ్యుడైన గణపతే ఈ విషయంలోనూ ముందు నిలబడి, మన సందేహాలను తొలగించగలడు. ఎలాగంటారా? చూడండి–



భాద్రపదశుద్ధ తదియనాడు సూర్యోదయానికి ముందు త్రికోణాకారమైన నక్షత్ర పుంజం ఒకటి ఆకాశంలో ఉదయిస్తుంది. త్రికోణం అనేది ఎప్పుడూ మాతృమూర్తి అయిన దేవికి సంకేతం. అందువల్ల, ఆ రోజు "గౌరీ వ్రత" మని ధర్మశాస్త్ర గ్రంథాలు వ్రాస్తాయి. దీన్ని ఆంధ్రులు సరిగా ఆచరించటంలేదు. కర్నాట కులు "గౌరీహబ్బ" అనే పేరుతో చాలా శ్రద్ధగా ఆచరిస్తున్నారు (హబ్బ) అంటే పబ్బ. పబ్బ అంటే పండుగ. "పండుగలూ, పబ్బాలు" అనే వాడుక ఇప్పటికీ తెలుగులో వుంది. తెలుగు పదారంభంలోగల పకారం కన్నడంలో సామాన్యంగా హకారంగా మారుతుంది. అందువల్ల మన పబ్బే వారి హబ్బ).

## భాద్రపదశుద్ధ చవితి–

భాద్రపద శుద్ధ చవితినాడు సూర్యోదయానికి ముందు ఆకాశంలో – అడుగున చిన్న ఎలుక లాగానూ, దానిపైన పెద్ద బాన వంటి మధ్యభాగంగల ఆకారం లాగానూ, కనిపించే నక్షత్రాల గుంపులు రెండు ఉదయిస్తాయి. ఈ దేవతనే ఎలుక వాహనం గల లంబోదర గణపతి దేవతగా వేదాలు, పురాణాలు, నిర్ణయించాయి. అంతే కాదు, సామాన్యంగా భాద్రపద శుద్ధచవితి నాటికి హస్తా నక్షత్రం వుంటుంది. అంటే ఆనాటి చంద్రుడు హస్తానక్షత్రంలో వుంటాడు! (నిజానికి హస్తా నక్షత్రం అనేది ఒక గుంపే. ఒంటరి నక్షత్రం కాదు). హస్తం గలవాడు హస్తి. హస్తి అంటే ఏనుగు. కనుక, ఆనాటి లంబోదర దేవత హస్తి ముఖుడని వేదాలు నిర్వచించాయి. దాన్నే పురాణాలు అను వదించాయి.

తిథులు నెలకు 30 గా సాగుతూ ఉంటాయి. నక్షత్రాలు 27 మాత్రమే కనుక ఈ రెండు వృత్తాలూ సమంగా సాగవు. వాటి సమన్వయం కోసమే అధిక మాసాలు ఏర్పడ్డాయి. ఆ గణితం గోల ప్రస్తుతం మనకు వద్దు. భాద్రపద శుద్ధ చవితి నాటికి హస్తా నక్షత్రం సరిగా ఆ తిథిలో లేకపోయినా, దానికి దగ్గరలో మాత్రం ఉంటుంది. హస్తా నక్షత్రం కలసి వస్తే ఆ చవితి ప్రశస్తం అని మాత్రం ధర్మశాస్త్ర గ్రంథాలు చెపుతాయి.

మొత్తంమీద తేలిందేమిటంటే, భాద్రపదశుద్ధ చవితినాడు, సూర్యోదయ సమయానికి ఆకాశంలో ఎలుకగుంపు, బానగుంపు – నక్షత్రాలు ఉదయిస్తూ వుంటాయి. కనుక, మన అందాల బొజ్జ గణపతి, ఏనుగు తొండంతో, ఎలుక వాహనంతో, మన యిళ్లల్లోకి ప్రవేశిస్తాడు. మన మంతా ఆ స్వామిని

**తుండమునేకదంతమును తోరపు బొజ్జయు, వామహస్తమున్ ।**
**మెండుగమ్రోయు గజ్జలును, మెల్లని చూపులు, మందహాసమున్॥**
**కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల ఒజ్జవై**
**యుండెడి పార్వతీ తనయ! ఓయి గణాధిప! నీకు మ్రొక్కెదన్ ॥**

అని వేడుకుండూ వుంటాం. ఇదే వినాయకచవితి.

ఇక భాద్రపద శుద్ధ పంచమినాటి ఉదయానికి ఆకాశంలో సప్తర్షి నక్షత్రాలు ఉదయిస్తూ ఉంటాయి. (ఇది అందరికీ తెలిసిన నక్షత్రాల గుంపే.) అందువల్లే ఆ రోజు "ఋషి పంచమీ వ్రతం". దీన్ని ఆంధ్రులలో కొద్ది మందే ఆచరిస్తున్నారు. కర్ణాటకులు విస్తారంగా ఆచరిస్తున్నారు.

## పుత్రగణపతివ్రతం–

భాద్రపదశుద్ధ చవితి నుంచి 180 డిగ్రీలు అంటే 180 రోజులు, అంటే ఆరు నెలలు. గడిచే సరికి ఫాల్గుణ శుద్ధ చవితి వస్తుంది. ఆనాటికి, ఇందాకటి గణపతి నక్షత్ర సమూహం సూర్యాస్తమయం కాగానే ఉదయిస్తుంది. వేదంలో చెప్పిన సూత్రం ప్రకారం– ఆనాడు కూడా పూజ్యదేవత గణపతే. అందుకే ధర్మ శాస్త్రకారులు ఆనాడు "పుత్రగణపతి వ్రతం" అన్నారు. దాన్ని యీనాడు మనం సరిగా ఆచరించటం లేదు. అది నక్షత్రాల తప్పుకాదు, ధర్మశాస్త్రాల తప్పుకాదు, కదా!

ఈ విధంగా గణపతి రూపం గాని, గణపతి పర్వం గాని, ఎవరి సొంత కల్పనలూ కావనీ, అది ప్రకృతి యేర్పరచిన సృష్టి రహస్యమనీ, దాన్ని తపోమయ దృష్టులతో దర్శించిన మన మహర్షులు మనకు దాన్ని వ్రత రూపంలో అందించారనీ అర్థం చేసుకున్నాం.

## గణేశలీల – ఖగోళఖేల–

ఇక, గణేశ జీవిత చరిత్రగా, చెప్పబడే ప్రధాన ఘట్టాలన్నీ గూడా ఖగోళంలో నక్షత్ర లోక దృశ్యాల వర్ణనలే ననే విషయం తెలుసుకో వలసి వుంది. ఈ విషయాలను పూజ్యులైన గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు, విస్సా అప్పారావుగారు, తిరుమల రామచంద్రగారు, సురవరపు ప్రతాపరెడ్డిగారు, మొదలైన పెద్దలు తమ గ్రంథాలలో చక్కగా వివరించారు. ఈ విషయంలో గొబ్బూరివారు అనేక గ్రంథాలు వ్రాసి వున్నారు. వాటిలో ఈ వివరాలు ఎక్కువగా వున్నాయి. సంగ్రహంగా ఒకటి మాత్రం చెప్పుకుందాం – నీలాపనిందలు రాకుండా వుండటం కోసం, వినాయక చవితినాడు శ్యమంతకో పాఖ్యానం వినాలని చాలా పురాణాల్లో వుంది. స్కంద పురాణంలో ఆ సందర్భంగా, ఒక సారాంశ శ్లోకం వుంది–

**సింహః ప్రసేన మవధీత్ సింహో జాంబవతా హతః ।**
**సుకుమారక మా రోదీః తవ హ్యేష శ్యమంతకః ॥**

ఈ శ్లోకాన్ని ఈ గ్రంథంలో శ్రీస్వామీజీ గూడా ఉదహరించారు. కథా పరంగా చూస్తే–

"(అడవిలో వుండే) సింహం (సత్రాజిత్తు తమ్ముడైన) ప్రసే నుడ్ని చంపింది. ఆ సింహాన్ని జాంబవంతుడు సంహరించాడు. ఓ పసివాడా! ఏడవకు, (సూర్యదేవుడి ప్రసాదంవల్ల లభించిన) ఈ శ్యమంతక మణి ఇక నీదే!" అని ఈ శ్లోకానికి అర్థం.

## ఇక ఖగోళపరంగాచూద్దాం –

భాద్రపద మనేది చాంద్రమాన మాసం. సౌరమానంలో చూస్తే అది సింహమాసం. అంటే, సూర్యుడు సింహరాశిలో వున్నాడు. బంగారు కిరణాలను వెదజల్లే సూర్యుడే, నిత్యమూ బంగారాన్ని పండించే శ్యమంతకమణి! ప్రసేనుడంటే, ఉగ్రంగా వుండే గ్రీష్మకాలం. వాడ్ని సింహరాశి సంహరించింది. అంటే, గ్రీష్మకాలం పోయి సింహమాసం ప్రవేశించింది– అన్నమాట.

అదే సింహరాశిలో పంచమినాటికి సప్తర్షి మండలం ప్రవేశించబోతోంది. సప్తర్షి మండలానికి నక్షత్ర శాస్త్ర పరిభాషలో భల్లూకమని పేరు. అంటే ఎలుకబంటి అని అర్థం. పశ్చిమ దేశీయులు గూడా యీ నక్షత్ర సమూహాన్ని అదే అర్థంతో "Great bear" అని పిలుస్తారు! సింహం పంచమినాటికి భల్లూకాక్రాన్తం కాబోతోంది కనుక, ఆ విషయాన్నే జాంబవంతుడు (భల్లూకం) సింహాన్ని చంపడంగా కథలో చెప్పారు. ●

**'ప్రముఖాంధ్ర' రజతోత్సవ సంచిక పుష్కల విశేషములతో అలరారేట్టు రావడంలో పరితుల తోడ్పాటు కోరుతూన్నాం.**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**



# "విశ్వ" పూజనీయుడు మన శ్రీగణేశుడు

**విఘ్నః** అనే పదానికి విశ్వమంతా వ్యాపించినవాడని వేదం నిర్వచిస్తోంది. సరిగ్గా ఇటువంటి అర్థాన్నే 'గణ' అనే పదం కూడా సూచిస్తున్నదని వల్లో(ల్ల)భోపనిషత్తు, అధర్వశీర్షములు పేర్కొనడం ఒక విశేషం. దీనినిబట్టీ చూచినట్లయితే మన చిరు బొజ్జ గణపయ్య కేవలం ఒక్క భారతావనిలోనే కాక మిగిలిన ఖండాలలో కూడా పూజలందుకుంటున్నట్లు తెలుస్తున్నది.

ఇరాన్‌లోని శ్రీ గణేశమహరాజ్, చైనా, థాయ్‌లాండ్, అమ్‌స్టర్‌గామ్, జావా, కాబూల్, మెక్సికో లోని గణేశులు, ఆఫ్ఘనిస్తాన్, తుర్కిస్తాన్‌ల్లోని వినాయకులు, జపాన్‌లోని వజ్ర వినాయకమూర్తి, నేపాల్‌లోని విఘ్నేశ్వరమూర్తులు ప్రపంచంలోని అతి పురాతన విగ్రహమూర్తులుగా గుర్తించబడినాయి.

జబర్‌పూర్‌లోని భేరిఘాట్ వద్ద వినాయకుడు 'గణేశిని' అనే స్త్రీమూర్తి రూపంలో దర్శనం ఇస్తాడు. తమిళనాడులోని మధురైలో వ్యాఘ్రపాదునిగానూ, రాయవెల్లూరు కోటలోని జలగంఠేశ్వర దేవాలయాలు ప్రాకులాడే బాల గణపతిగానూ, ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైల క్షేత్రంలో వేణు గణపతిగానూ దర్శనం ఇస్తాడు.

బోర్నియోలో "మహభిని"గా, మంగోలియాలో "టోట్కరు" నిగా, టిబెట్‌లో "చోప్రాకు"నిగా, కంబోడియాలో "బృహగణేశు" నిగా, చైనాలో "వాన్షి దియార్"గా, జపాన్‌లో "వినాయసునిగా" గణేశ ఆరాధనం జరుగుతోంది. (వజ్రగణేశుడు).

చైనాలో 'సైని' అనే చక్రవర్తి నిర్మించిన అతి ప్రాచీనమైన గణేశుని రాతి దేవాలయాన్ని నేటికీ మనం చూడవచ్చును.

నేపాల్‌లో పంచముఖ గణేశ ఆలయం సుప్రసిద్ధమైనది.

జావాలోని ధ్యానముద్ర గణపతి టూరిస్టులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా భాసిల్లుతున్నాడు.

తమిళనాడులోని తిరువత్తియూర్‌లోని గణేశ్ ఆలయంలోని మూర్తికి రావణ బ్రహ్మకు మాదిరిగా ఒకే వరుసలో పంచశిరములు వుంటాయి. నాగపట్నంలోని పంచముఖ గణేశుని ప్రతిమలో నాల్గు ముఖాలు పైన అయిదోవదీ వుంటుంది. తిరునల్లారులోని గణేశమూర్తి సాలగ్రామ శిలగా దర్శనం ఇస్తాడు. మధురైలోని ధాన్య–ఆహార గణపతిని చూచి తీరవలసిందే. చిదంబరంలోని తిరుపవనం, మైసూరు లోని హెయసల గుళ్ళలో గణపతి నృత్యం చేస్తూ కనులకు విందు చేస్తున్నాడు.

## చోడవరం

విశాఖ జిల్లాలోని చోడవరంలో వున్న విఘ్నేశ్వరాలయానికి ఒక విశిష్టత ఉన్నది. ఇక్కడి మూర్తి కొన్ని వేల సంవత్సరాల క్రిందట వెలసిన 'స్వయంభూ'గా చరిత్రకారులు గుర్తించారు. చోడవరానికి తూర్పుముఖంగా వున్న ఈ గుడిని సుమారుగా 6000 వేల సం॥లగా ఉందట; మత్స్యవంశపు రాజులు నిర్మించారు. ఇక్కడ మూర్తిని మత్స్య గణపతిగా పేర్కొంటారు. తురుష్కుల దండయాత్రలో చెదరిన ఈ ఆలయాన్ని చోళులు తిరిగి పునర్మించారు. ఆంధ్ర రాష్ట్రంలో కాణీపాకం తర్వాత స్వయంభూగణపతి వున్న ప్రదేశం చోడవరం కావడం విశేషం. అప్పడానికి పురాతనమే అయినా గడచిన 200 సం॥ల క్రిందట నుంచీ ఇక్కడ పూజా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి గణపతి నడుము వరకే దర్శనం ఇస్తాడు. తొండం చివర కన్పించదు. ఈ విగ్రహం యేటేటా పెరుగుతుందని ప్రతీతి. ప్రస్తుతం పాతచెరువు వద్ద వెలసిన ఈ మూర్తిని భూమినుంచి త్రవ్వి – గౌరీశ్వరాలయం లోనికి తీసుకుని వెళ్లడానికి ప్రయత్నించగా అది సాధ్యపడలేదు సరికదా! తొండం చివర చూద్దామని 20 అడుగుల భూమిని తవ్వినా, అది కన్పించలేదట. ప్రస్తుతం ఈ తవ్విన భూమిని ఏనుగు బోదె అని పిలుస్తున్నారు. ఇక్కడ చెరువు ఒకటిని నిర్మించారు.

## అయినపల్లి

తూ.గో.జిల్లా అమలాపురంకు అత్యంత చేరువలో అత్యంత పురాతనమైన అయినవిల్లి గణేశ క్షేత్రం వున్నది. ఈ క్షేత్రం పూర్తిగా దేవతానిర్మితం. దక్షయజ్ఞ ప్రారంభసమయంలో దక్షుడు ఇక్కడ స్వామిని పూజించడం వల్లనే శిరస్సు తెగినా మేక శిరస్సుతో పునర్జీవితుడైనట్లు క్షేత్రపురాణం చెబుతున్నది. ఇక్కడి స్వామి నారికేళ ప్రియుడుగా ప్రసిద్ధుడు.

## కాజీపేట

హైదరాబాద్ – హన్మకొండ రహదారిలోని రైల్వే దేవా లయం భవన సముదాయంలో వున్న శ్వేతార్కముల గణపతి ఆలయం కోరిన కోర్కెలు తీర్చడంలో పేరుగాంచింది. ఇక్కడ మూర్తి జిల్లేడు మొక్క నుంచి ఉద్భవించాడు. విదేశీయులు సైతం ఈ క్షేత్రాన్ని సందర్శించి ధన్యులవుతుంటారు.

## రాయదుర్గం

రాయదుర్గం కోట మెట్ల వద్ద ఆత్మకూరు వీధిలో వున్న 12.5 అడుగుల ఎత్తులో వున్న దశభుజ గణపతిని సందర్శించి తరించాల్సిందే కానీ వర్ణింప నలవికాదు. అదేవిధంగా అమరావతిలోని ధరణికోట లోని నాలుగు అంతస్తుల విఘ్నేశ్వరుని గర్భాలయం రమణీయతను చూడవల్సిందేగాని చెప్పనలవికాదు. ఈ ఆలయ నిర్మాణానికి సుమారుగా 75 లక్షలు ఖర్చు అయ్యింది. 44 తర్పణాలలో ఇక్కడ మూర్తిని 'గ'కారంతో అర్చిస్తే సర్వకోర్కెలు సఫలం అవుతాయి.

## కుర్తాళం

తమిళనాడులోని కుర్తాళంలో వున్న నాడీగణపతి ఆలయం విశిష్టమైంది. కొన్ని వందల సం॥ల క్రిందట మౌనస్వామి అనే సాధువు ఇచ్చట మూర్తికి హారతి ఇస్తుండగా ఆ హారతి సెగకు స్వామివారి విగ్రహం స్పందించి కొంచెం వెనక్కు జరిగిందట. అంటే స్వామివారికి నాడీ స్పందన వున్నట్లుగా అప్పుడే రూఢీ అయ్యింది. స్వామివారి తొండము, తొడలందు ఈ నాడీ స్పందన శబ్దాన్ని మనం చెవియొగ్గి వినవచ్చు కూడానూ!

## ముంబయి

ముంబయి దక్షిణ ప్రాంతంలో పోర్చుగీసువారు నిర్మించి– స్థాపించిన సిద్ధివినాయక దేవాలయం ప్రాచీనమైనది. ఇక్కడి స్వామి సుమారుగా 36 అడుగుల ఎత్తు మాత్రమే వుంటారు. కృత్రిమమైన రంగులు వేయడం వల్ల విగ్రహం తన ప్రాచీనతను కోల్పోయినట్లుగా కన్పిస్తుంది. అత్యధిక రాబడి గల ఆలయాల్లో ఇది మొదటి స్థానంలో నిలుస్తున్నది (45ల/సం॥రానికి కోల్‌కత్తా) కె.ఆర్. రామకృష్ణన్ అనే వ్యక్తి మార్చి– 2001 లో జరిగిన క్రికెట్ క్రీడలో భారతజట్టు విజయం సాధించాలని ఈ ప్రదేశంలో క్రికెట్ గణేశ్ ఆలయాన్ని నిర్మించాడు. భక్తుని కోరిక భగవంతుడు తీర్చడంతో ఈ ఆలయం వార్తల్లోకెక్కింది. ఆ ఆలయంలో ఎడమ–కుడి వైపుల తొండములున్న ఇద్దరు గణేశులు పూజలందుకోవడం మరొక విశేషం.

## సాకోరి

షిర్డికు 12 కి.మీ. దూరంలో సాకోరి అనే ప్రదేశంలోని ఉపాసనీ మందిర ఆవరణంలో వున్న ఒక మునగచెట్టు కొమ్మపై చిత్రంగా గణేశుడు వెలిశాడు. ఈ స్వామి మునగ గణపతిగా భక్తుల పూజలందుకుంటున్నాడు.

# గణపతి కథలో సంకేతార్థములు

గణపతి కథ సుప్రసిద్ధం. కథను మించి, అందులో ఎన్నో సంకేతార్థాలు అంతర్లీనమై ఉన్నాయి. చర్చలోకి వెళ్ళకుండా, సంప్రదాయ సిద్ధమైన సాంకేతిక అర్థాలను మాత్రం సూత్రప్రాయంగా ప్రస్తావించుకొందాం.

1. గజాసురునిలో – ఏనుగు తల – బుద్ధి ప్రధానమైన భౌతిక సుఖలంపటత్వానికి సంకేతం. ఏనుగు శాకాహారి, మహాబల సంపన్నం, కాని తోలు మందం. ఈ లక్షణాలన్నీ కలిసి అతనిని అసురుని చేస్తున్నాయి.

2. శివుణ్ణి పొట్టలో దాచుకోవడం – ఇది దైవం నాకు మాత్రమే దక్కాలనే దుర్గుణం.

3. నలుగు పిండితో బొమ్మ – శరీరానికి దీప్తిని కలిగంచేది నలుగు పిండి కనుక శక్తి ఉద్దీపకమైన పదార్థంతో తయారైన బొమ్మే గణపతి శరీరం.

4. వాకిలి దగ్గర కాపలా – శక్తికి వాకిలి మూలాధారం. మూలాధారాధిపతి గణపతి. అతని చేతిలోని శూలం సుషుమ్నానాడి.

5. శివుడు పార్వతీ పుత్రుని తల ఖండించటం– శివుడు జ్ఞానస్వరూపి. పరిశుద్ధ జ్ఞానం కుండలినీ శక్తివల్ల వచ్చే సిద్ధులను తిరస్కరించి, శక్తితో అభేద భావాన్ని పొందుతుంది.

6. గణపతిలోని ఏనుగు తల – ఈ తల అసురత్వాన్ని వదలి బుద్ధిశక్తి అనగా జ్ఞానశక్తి. శక్తి పుత్రుడికి జ్ఞానశక్తితో సమన్వయం సిద్ధించటమే గజాననోత్పత్తి. (ఏనుగు అనే అర్థంలో ఉపనిషత్తులు గజ అనే పదాన్నే ఈ సందర్భంలో ఎక్కువగా ఉపయోగించాయి. గజ శబ్దానికి అనేక విశేషార్థాలు వున్నాయి.)

7. గణపతి బొజ్జ – మణిపూర చక్రంలో గల అగ్ని, శరీరంలోని సమస్త భౌతిక మానసిక కార్యకలాపాలను నిర్వహించే శక్తి గలది. దీనిని ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిభాషలో శారీరక విద్యుచ్ఛక్తిగా గుర్తించాలి. దీని యొక్క విజృంభణను పెద్ద బొజ్జ సూచిస్తోంది. దీని చుట్టూగల నాగబంధం దీన్నే బలపరుస్తోంది. నాగమంటే కుండలినీ శక్తే.

8. ఏకదంతం – దంతం బలాన్నీ, జ్ఞానాన్నీ కూడా సంకేత పరుస్తుంది. జ్ఞానమే అర్థంలో ఒక దంతం విరిగిపోవటం వల్ల భేదజ్ఞానం నశించి, అద్వైత జ్ఞానం సిద్ధపడిందని సంకేతం. అసురత్వం నశించిన బుద్ధిశక్తి, అభేదాన్నే దర్శించ గలుగుతుంది. బలమనే అర్థంలో అహంకారాన్ని కలిగించే ఎడమ దంతం విరిగి, కర్తృత్వ బుద్ధిని వదలిని దైవబలాన్ని సూచించే కుడి దంతం మిగిలిందని సూచన.

9. వక్రతుండం – ఇది ఓంకార సూచన, దీన్ని గురించి ఇది వరకే చెప్పుకొన్నాం.

10. మూషిక వాహనం – వేదాంత పరంగా మూషికం అంటే దొంగిలించేది. అనగా మాయ. మాయ గణపతికి అధీనంలో వుంటుంది. అనేది మూషిక వాహనంలోని సంకేతం. లోకపరంగా మూషికం వ్యవసాయాదులలోని ఈతిబాధలకు సంకేతం. వాటన్నిటినీ నిగ్రహించేవారే మూషిక వాహనుడు.

11. సిద్ధి బుద్ధులు – గణపతి నిత్య బ్రహ్మచారి అని ప్రసిద్ధి వుంది. బ్రహ్మచారి అనగా జ్ఞాని. జ్ఞానం కలవాడికి సిద్ధి అనగా సంకల్ప సిద్ధి, బుద్ధి అనగా ఆత్మసిద్ధి, ఈ రెండూ స్వయంగా వశమౌతాయి. కథలో వీరిద్దరూ విశ్వరూపుని కుమార్తెలు. విశ్వరూప మరగా విరాట్రూపం.

12. చంద్రుడు నవ్వటం– యోగపరంగా చంద్రుడు అమృతకళ, కామకళకూ కూడా సంకేతమే. సందర్భాన్ని అనుసరించి, ఎక్కడ ఏ సంకేతాన్ని గ్రహించాలో నిర్ణయించాలి. ఇక్కడి చంద్రుడు కామకళా స్వరూపుడు. అందుకే ఇతడు శక్తి జ్ఞాన సమన్వయమైన గణపతిని చూసి పరిహసించాడు. కామకళయందు ఆసక్తి గలవారు నిందల పాలు కాకతప్పదు.

13. శ్యమంతకమణి– ఇది సూర్య ప్రతినిధి. యోగపరంగా సూర్యుడు సరియైన దృష్టిని కలిగించేవాడు. చంద్రుడికి కాంతి అందించేవాడు. దృష్టిలో మార్పు వస్తే కామకళా రూపమైన చంద్రుడు జ్ఞానకళా రూపిగా మారుతారు. శ్యమంతకమణి కథవల్ల శాప పరిహారం అంటే యిదే.

14. గణపతి తొండం చివరగల మోదకం– మోదమంటే ఆనందం మోదకమంటే సర్వోత్తమ ఆనందం.

రచన : **జ్ఞాన కులపతి శ్రీకుప్పా వేంకట కృష్ణమూర్తి,**
చైర్మన్, ఐ- సర్వ్

## తిరుప్పవనం

మధురై (తమిళనాడు)నుంచి రామేశ్వరానికి వెళ్లే దారిలో వైగైనది దక్షిణ తీరంలో ముక్తిగణేశుని ఆలయం చెప్పుకోదగినది. మృతుల అస్తికలను వైగైనదిలో నిమజ్జనం చేసిన అనంతరం ఇక్కడి స్వామిని అర్చిస్తే, మృతులకు ముక్తిలభిస్తుంది. కాశీ, రామేశ్వరం వెళ్ళలేనివారు ఇక్కడ కర్మకాండలు నిర్వహించుకో వచ్చును.

## టిట్‌వళా

ముంబాయి – కాసారా మధ్యనున్న లోకల్ రైలు మార్గంలోని టిట్‌వళా నుండి 2 కి.మీ. దూరంలో ఒక మహా గణేశ మందిరం వుంది. 36 అడుగుల పీఠంపై చతుర్భుజాలతో వుండే ఈ స్వామిని దర్శించిన పెళ్ళికాని యువతీ–యువకులకు ఠక్కున పెళ్ళిల్లు జరిగిపోతున్నాయి. కుజదోషం వున్నవారు తప్పక చూడవలసిన క్షేత్రం ఇది.

## వాయి

సతారా జిల్లా పూనేకి 100 కి.మీ. దూరంలో వాయి అనే ప్రాంతం వుంది. ఇక్కడ గణేశుడు ఢోల్యాగణపతికి అర్చనలు అందుకుంటున్నాడు. 10 అడుగుల ఎత్తు, 8 అడుగుల వెడల్పు కల మూర్తి దుస్వప్నాలను నివారిస్తాడని ప్రతీతి.

## శ్రీలంక (కంచ్)

శ్రీలంకలోని 'పర్ధ్వ'కి– యవతమళ అనే ప్రాంతాలకు దగ్గర్లో 'కళంబ' వద్ద చింతామణి గణేశ నామంతో (ఏక వింశతి–21–శక్తి పీఠాల్లో ఇదొకటి) వినాయకుడు పూజలందు కుంటున్నాడు. ఈ గుడి భూగర్భంలో 12 మీటర్ల లోతున వుంటుంది. ఇక్కడ పుష్కరానికొక (12 సం॥రాలు) ఉత్సవం చేస్తారు. గౌతముని శాపం పొందిన ఇంద్రుడు ఇక్కడకు వచ్చి చింతామణి గణేశుని పూజించాడని పురాణ కథనం. ఈ మందిరానికి త్రిప్రవేశ ద్వారాలు వుండటం ప్రత్యేకత. చతుర్ముఖాలల్లో అలరారే ఈ స్వామిని పరివేష్టిస్తూ మరో నల్గురు గణేశులు వుండటం ఇక్కడ మాత్రమే చూడగలం.

## పుళే-ఉం

మహారాష్ట్రకు దక్షిణంగా 350 కి.మీ. దూరంలో రత్నగిరి జిల్లా సాగర తీరాన అతి ప్రాచీనమైనదిగా చెప్పబడుతున్న పుళే–ఉ అనే ప్రాంతంలోని శ్రీ గణేశ దేవాలయం తప్పక చూడవలసిన క్షేత్రం. ఇక్కడ స్వామివారు పుళేగణపతి (నిరాకారుడని అర్థం) అని, 'ఉరి' అనగా తడిసిన ఇసుక అని అర్థం) పేర్లలో పూజలందుకుంటున్నాడు. ఈ క్షేత్రాన్ని ఛత్రపతి శివాజీ మంత్రి అన్నొంజీ నిర్మించాడు. నూతన కట్టడాలు నిర్మించే ముందు ఈ స్వామి అనుగ్రహం పొందడం ఉత్తమం.

## హేందవీ

ముంబాయి– గృహగర్‌కు 23 కి.మీ. దూరంలో (రత్నగిరి జిల్లా) 3 1/2 అడుగుల ఎత్తైన లక్ష్మీగణేశుని హేందవీ క్షేత్రం పాలరాతి శిల్పంగా దర్శనం ఇస్తుంది. ఇక్కడి స్వామి దశ భుజుడు. లక్ష్మీకటాక్షం అవిఘ్నంగా పొందాలనుకునేవారు చూడవలసిన క్షేత్రం ఇది.

## కాణిపాకం

చిత్తూరుకు 12 కి.మీ. దూరంలో ఐరాల మండలం అనే ప్రదేశంలో "విహార పురి" (కాణిపాకం యొక్క అసలు పేరు) అనే ప్రదేశంలోని వరసిద్ధి వినాయకుని కేత్రం జగద్విఖ్యాతం. ఇది 11వ శతాబ్దానికి చెం దిన దేవాలయముగా చరిత్ర పేర్కొన్నది. కుళోత్తుంగుడనే చోళరాజు బ్రహ్మహత్యా పాతక పరిహారం కోసం ఈ క్షేత్రాన్ని నిర్మిం చగా విజయనగర రాజులు దీనిని వృద్ధి పొందించారు. ఈ స్వామివారి విగ్రహం రోజు రోజుకూ పెరుగు తున్నది అనడానికి నిదర్శనంగా 1956లో స్వామివారికి చేయిం చిన వెండితొడుగు నేడు ఆయనకు పట్టడంలేదు. కాణి అనగా 1-25 ఎకరములు అని, 'పాకం' అనగా కొబ్బరియని అర్థము. ●

## పరమార్థ కథలు
## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు



# సుఖమునకు రాజబాట

పూర్వమొకపుడు ఒకానొక వర్తకుడు కొంత డబ్బును మూటకట్టుకొని యాత్ర చేయుటకై బయల్వెడలెను. దారిలో అచటచట సత్రము నందో, దేవాలయమునందో విశ్రమించుచు ప్రయాణము కొనసాగించుచుండెను. వర్తకుని యొద్దగల డబ్బుమూట జూచి మఱియొకనికి దానిని తస్కరించవలెనను దుర్బుద్ధి జనించి స్నేహితునివలె నటించి మెల్లగా అతని చెంతచేరెను. ఇరువురును పరమమిత్రులవలె మెలగుచు యాత్రసల్పుచుండిరి.

ఒకనాటి రేయి ఇద్దరును ఒక సత్రమునందలి గదిలో పరుండిరి. వర్తకుడు గాఢనిద్ర పోవుచుండ, ఆ కపట మిత్రుడు నెమ్మదిగా లేచి డబ్బుమూట కొరకై గదియంతయు వెతకెను. వర్తకుని పెట్టె, సంచులు, చొక్కా మూటలు అన్నియు విప్పి చూచెను. కాని డబ్బు మూట కనిపించలేదు. మరల మరల వెతికెను. కాని కనిపించలేదు. మరుసటి రోజు ఉదయమున తన స్నేహితునితో మాట్లాడుచూ మాట సందర్భములో 'రాత్రి మీ డబ్బు మూట ఎచట దాచితిరి?' అని ప్రశ్నింప అతడు 'నీ దిండు క్రిందనే' అని జవాబిచ్చెను. కపట మిత్రుడు అత్యాశ్చర్యపడెను. వర్తకుడు తన మిత్రుని దొంగగా గ్రహించి అతడెట్లయినను తన ధనమును అపహరించునని తలంచి ఆ మూటను ప్రతిరోజు ఆ మిత్రుని తల (దిండు) క్రిందనే దాచుచుండెను. ఏలయనగా దొంగ అన్ని చోట్ల వెదకునుగాని తన తల (దిండు) క్రింద వెతకడు. వర్తకునకో, దొంగలను మేపు అభ్యాసము కలదు. కనుక తన ధనరక్షణ కొరకై యీ చక్కని ఉపాయము అవలంభించెను.

ఆ ప్రకారమే జీవుడు బ్రహ్మానందవారాశిని తన హృదయమునందే ఉంచుకొని ప్రపంచమంతయు ఆనందము కొరకు వెతకుచున్నాడు. కాని యెంత వెతికినను ఆ శాశ్వతానందమాతనికి బయట ఎచటను లభించుటలేదు. అది అంతరంగముననే కలదు. ఆ రహస్యమతనికి తెలియక అజ్ఞాన వశమున బయట తుచ్ఛసుఖములకై తిరుగాడుచున్నాడు. 'విన్దత్యాత్మని యత్సుఖమ్', 'సుఖమక్షయ మశ్నుతే, యోఽన్తః సుఖో' ఇత్యాది వాక్యముల ద్వారా శ్రీకృష్ణపరమాత్మ అక్షయసుఖము లోపలనే కలదని స్పష్టము చేసియున్నాడు.

ప్రతిరోజు గాఢ నిద్రపోవునపుడు బాహ్య వస్తువు లన్నింటిని మఱచి, సంకల్పము లను కూడా వదలి జీవుడు అవిచ్ఛిన్నమగు (Homogeneous) సుఖము తనయందే అనుభవించుచుండుట చూచుచున్నారము కదా! ఆ సమయమున ఎట్టి దుఃఖము కూడా స్ఫురణకు రాక జీవునకు పరమశాంతి కలుగుచుండును. అజ్ఞానస్థితిలో మనస్సు యొక్క తాత్కాలిక ఉపశమన రూపమగు సుషుప్తియందే ఇంత సుఖము జీవునకు అభ్యంతరమున లభించుచుండ ఇక జ్ఞానస్థితిలో మనస్సు యొక్క శాశ్వత ఉపశమనరూపమగు సమాధిస్థితియం దెంత సుఖము లభించగలదు? కాబట్టి అట్టి అనంతాత్మ సుఖప్రాప్తికై బాహ్య అల్పసుఖములను జీవుడు పరి త్యజించవలసి యుండును. దానినే విషయ విరక్తి యందురు. కొంత త్యాగమువలంభించి ఈ కార్యమును సాధించినచో ఫలితము అఖండదైవ ప్రాప్తియే.

కావున విజ్ఞులగువారు తమ అమూల్య మానవ జన్మను సార్థకపరచుకొనుట కొరకు ప్రయత్నశీలురై, విషయసుఖములను పరిత్యజించుచు ఇంద్రియ మనో విగ్రహమును సాధించుచు, కామక్రోధాదుల వేగమును అణచుచుందురు. జీవితకాలము అతి స్వల్పము. తెలిసికొనవలసిన ధర్మములా పెక్కుగలవు. ఆచరించ వలసిన సాధనలా అనేకములున్నవి. విఘ్నములా లెక్కలేనన్ని వచ్చి పైబడుచున్నది. ఇట్టి స్థితిలో జీవుడు ఎంతత్వరితముగ తన లక్ష్యమును సాధింపగల్గునో అంత శ్రేయస్కరము. మృత్యువు ప్రతి నిముషము జీవుని కబళించుటకై ప్రక్కనే వేచియున్నది. వార్ధక్య, రోగాదులు హుంకరించుచు మీదపడబోవుచున్నవి. కావున వానివలన అపకారము కలుగక పూర్వమే, మృత్యువు దాపురించక మునుపే, ఇంద్రియముల శక్తి ఉడుగక పూర్వమే వైరాగ్య శమదమాది సాధనలను అభ్యసించి స్వస్వరూపానుభవ మును పొందవలసి యుండును.

మరణించిన పిదప మానవ జన్మ వచ్చునను 'గ్యారంటీ' లేదు. ఆ ప్రకారముగ భగవంతుడు మనకు హామీపత్ర మేదియు నివ్వలేదు. ఒక వేళ ఇతరలోకములందు జన్మించితిమా, అచట పరమార్థ సాధనలకు అనుగుణమైన వాతావరణ ముండదు. అవి యన్నియు భోగభూములేగాని యోగభూములు కావు. కర్మభూము లంతకంటెను కావు. భూలోకమొకటియే చక్కని కర్మక్షేత్రము. పాపము చేసినచో నరకమునకు, పుణ్యము చేసినచో స్వర్గమునకు, జ్ఞానము పొందినచో మోక్షమునకు ఇక్కడ నుండియే జీవునకు నేరుగా టికెట్టు (Passport) దొరుకును. తన గమ్యమును తాను ఇచటనే నిర్ణయించుకొనవచ్చును. కాబట్టి త్వరలో సద్గురువు నాశ్రయించి తరుణోపాయమును ఎఱుంగవలెను. అది యేదియో గురోర్గురువైన శ్రీకృష్ణమూర్తి గీతయందు వెల్లడించియే యున్నాడు.

**శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః॥**

పరమార్థ సుఖము ఎవనికి లభించును? కామక్రోధాదులను నిగ్రహింపగలిగిన వానికి. వానిని ఎపుడు నిగ్రహించవలెను? ఈ శరీరము పతనము కాకపూర్వమే అనగా మృత్యువాసన్న మగుటకు ముందే ఎచట నిగ్రహించవలెను? ఇచటనే, ఈ మానవ జన్మయందే, ఈ భూలోకముననే (ఇహైవ)– ఇవ్విధముగ పరమాత్మ అధ్యాత్మ సుఖప్రాప్తికై రాజబాటను చూపెను. కోరికలను తగ్గించుకొనవలెను. ఆశలను విడనాడవలెను. విషయ సుఖములను పరిత్యజించవలెను. భోగాభిలాషను దూరీకృత మొనర్చుకొనవలెను. కామక్రోధాదులను అణచవలెను. అత్తఱి ప్రతిజీవికిని తన హృదయస్థమగు ఆత్మానంద రూప అఖండ సుఖము చక్కగా అనుభూతమగును.

**నీతి :** పరిపూర్ణమగు సుఖము తనయందే కలదు. మనస్సును నిగ్రహించి, నిర్మల మొనర్చి అంతర్ముఖము చేసి అట్టి సుఖమును జీవుడు అనుభూత మొనర్చుకొనవలెను. ●




# అవినీతిపరునికి కూడా 'నీతి' కావాలి!

ఆ మధ్య వచ్చిన ఒక సినిమాలో సన్నివేశమొకటున్నది. ఇంటిపట్టున ఉండక దొరికింది తింటూ ఉల్పాగా తిరిగే కుఱ్ఱవాడొకడున్నాడు. కోతులతో పోటీపడుతూ అవి తెచ్చుకు తింటున్న అరటిపళ్ళు లాక్కుని తాను తింటాడు. చెట్ల క్రిందా, చేమల క్రిందా కాలం గడుపుతున్నాడు.

చేతిలో డబ్బులు లేవు, పొట్టగడవడమెలా? ఒక ఉపాయం తోచింది... రోడ్డు మీద రివ్వున కారు వస్తోంది. అమాంతం వెళ్ళి కారు క్రింద పడ్డాడు. డ్రైవర్ సడన్ బ్రేకు వేసి కారు ఆపాడు.

ఇతడు 'కాలు విరిగిందో' అని దొంగేడుపు ఏడుస్తున్నాడు. కారుకు అడ్డంగా పడుకుని 'నేను చస్తే మా అమ్మను ఎవరు చూస్తారు?' అంటూ శోకాలారంభించాడు.

ఎదురుగా ఉన్న ఇంటిలో నుంచి మరొకడు పరుగెత్తుకుంటూ వచ్చి 'ఏయ్, నా తమ్ముడి మీదుగా కారుపోనిస్తావా? వాడు చస్తే మా ఇల్లు ఎలా గడుస్తుంది?' అంటూ డ్రైవర్ చొక్కా పుచ్చుకున్నాడు. 'పోలీసుస్టేషన్‌కు పద' అన్నాడు.

డ్రైవరిచ్చే డబ్బు చెరిసగం పంచుకుందామని ఇద్దరు సైగ చేసుకున్నారు. డ్రైవరు అయిదు వందల రూపాయలిచ్చి వీళ్ళను వదిలించుకొని కారు నడుపుకొని పోయారు.

ఆ తర్వాత వీళ్ళిద్దరూ డబ్బుకోసం కీచులాడుకున్నారు. 'నీకు కాలు విరగలేదు. చెయ్యి విరగలేదు, నీకిచ్చేదేమిటి పో' అంటూ అన్నగా నటన చేసినవాడు ఆ అయిదు వందల రూపాయలు జేబులో వేసుకొని 'మళ్ళీ మాట్లాడితే తంతాను' అని బెదిరించి వెళ్ళిపోయాడు.

అపుడు కారు క్రిందపడ్డవాడు 'ఎంత మోసం! ఇలాగయితే ఈ దేశం ఏ బాగుపడుతుంది?' అంటూ చింతించాడు.

నిజానికి ఇద్దరూ మోసగాళ్ళే. మొదటివాడు తాను కారు డ్రైవరును మోసగించినంత వరకు బాగానే ఉన్నది. తనను మరొకడు మోసగించినప్పుడు విషాదం కలిగింది. 'ఇలాగైతే దేశం ఇంకేం బాగుపడుతుంది' అనుకుంటున్నాడు.

ఇతరులను తాను దగా చేసినంత సేపు, తాను లంచం పుచ్చుకున్నంత సేపు ఆనందంగా ఉంటుంది. ఇతరులచే మోసగింపబడినపుడు, ఇతరులు తనను దగా చేసినపుడు విషాదం కలుగుతుంది. నీతి యొక్క అవసరం అప్పుడు తెలుస్తుంది.

అవినీతి పరుడు సైతం నీతిని కోరుతాడు! ●

## దేవుడి ప్రార్థన

మన పూర్వీకులు గుడికి వెళ్లినప్పుడు దర్శనం అయ్యాక గుడి నుండి బయటకు వచ్చే ముందు కొంతసేపు గుడి మండపంలో కానీ ప్రాకారం లోపల కానీ కొంతసేపు కూర్చుని ఒక చిన్న ప్రార్థన చేసేవారూ.

అది ఏమిటంటే..!

**"అనాయాసేన మరణం**
**వినా దైన్యేన జీవనం**
**దేహాంతే తవ సాన్నిధ్యం**
**దేహిమే పరమేశ్వరం."**

మీరు గుడి లోనికి వెళ్లినప్పుడు దేవుని ముందు నిల్చుని మీ రెండు చేతులను జోడించి, కళ్ళు తెరిచి ప్రశాంతమైన మనసుతో దర్శనం చేసుకోండి.

దర్శనం అయ్యి గుడి బయటకు వచ్చాక గుడి మండపంలో కూర్చుని కళ్ళు మూసుకుని అప్పుడు మళ్లీ భగవంతుని రూపాన్ని గుర్తుకు తెచ్చుకుని ఆయనను ఈ క్రింది విధముగా అడగండి.

**"అనాయాసేన మరణం"**

నాకు నొప్పి లేక బాధ కానీ లేని
మరణాన్ని ప్రసాదించు.

"వినా దైన్యేన జీవనం"

నాకు ఎవరి మీదా ఆధారపడకుండా, నేను జీవితంలో ఎవరి ముందూ తలవంచకుండా, ఎవరినీ నొప్పించకుండా, నేను ఎవరి వద్దా చులకన కాకుండా ఉండే జీవితాన్ని ప్రసాదించు.

**"దేహాంతే తవ సాన్నిధ్యం"**

మృత్యువు నావద్దకు వచ్చినప్పుడు నేను నిన్ను దర్శించుకునే విధంగా దీవించు.

**"దేహిమే పరమేశ్వరా"**

ఓ పరమేశ్వర నాకు ఈ క్రింది మూడు వరములను ప్రసాదించమని నిన్ను ప్రార్థిస్తున్నాను.

1) అనుక్షణం నీ ప్రార్థనలోనే గడిపే విధముగా అనుగ్రహించు.నీ ప్రార్థనతో నన్ను ఉత్తమమైన మార్గంలోకి తీసుకు వెళ్ళు.

2) ఎప్పుడూ కూడా నేను నిన్ను నాకు కానీ నా బిడ్డలకు కానీ సంపదలు కానీ పేరు ప్రఖ్యాతులు కానీ ఇవ్వమని అడగను కానీ నాకు నీవు ఉత్తమమైన నీ సాన్నిధ్యాన్ని అనుగ్రహించు.

3) నాకు ఎప్పుడూ కూడా నీవు సదా అండగా ఉండి నన్ను ఉత్తమమైన మార్గంలో నడిపించు.

ఇలా మీరు ఎప్పుడు గుడికి వెళ్లినా ఇప్పుడు చెప్పిన విషయాలు గుర్తుంచుకొని ప్రవర్తిస్తే మనకు ఏమి కావాలో అవి అన్ని కూడా మనం అడగకుండానే ఆయనే ప్రసాదిస్తాడని మరువకండి.

**"లోకా సమస్త సుఖినో భవంతు..!!**


**రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన**

# "అజంతా"

## వక్కపొడి

**రవికుమార్ అండ్ కంపెని - చెన్నై**


**రుచులు అడగడం దేనికి ! ప్రముఖాంధ్ర రజతోత్సవ విశేష సంచిక ఎదురుచూడండి!**

- త్వరలోనే వెలువడనున్నది. ప్రముఖాంధ్రుల ప్రతిభా విశేషాలనూ, త్రిలింగ దేశంగా విరాజిల్లిన ధార్మిక సంస్కృతినీ, విపులంగా, మేమెరింగినంత విశదంగా, చిత్తరువులతో, చిత్ర విశేషములతో వెలువరించే కృషి జరుగుచున్నది.

మీమీ అమూల్య రచనలనూ, పన్నెండు సంవత్సరాలుగా మీరు పొందిన అనుభూతుల్ని మీ ఫోటో వివరాలతో పంపండి. మీతో ఓ పదిమందిని ఉపకార చందాదారులు (రూ. 2,116లు) గానూ చేర్చండి. ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి, ప్రముఖాంధ్రుల తేజం ప్రపంచమంతా విరియాలి.



# బెజవాడలో కొరియర్ బాయ్ @ 80

ఎవరో ఉద్యోగమివ్వలేదని ఆడిపోసుకునే యువతకు ఆయన ఒక కనువిప్పు. ఎనభై మూడేళ్ల పైబడినా, జీవితమనే బండిని నడిపేందుకు తన కాళ్లనే నమ్ముకున్న ఆదర్శమూర్తి. ఎండనక, వాననక ప్రతి ఇంటికీ సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి, ఆహ్వాన పత్రాలను అందిస్తూ బెజవాడ కళాభిమానులందరికీ సుపరిచితులయ్యారాయన!

ఊరిలో ఉన్న సాంస్కృతిక సభలవారిలో అధిక భాగం, ఆయనకే ఆహ్వాన పత్రాలు బట్వాడా చేయమని ఇస్తారు. ఎందుకంటే అవి ఖచ్చితంగా చిరునామాదారులకు చేరతాయనే నమ్మకం! బెజవాడలోని సంగీత కళాకారుల, కళాప్రియుల చిరునామాలన్నీ ఆయనకు కరతలామలకాలే!

నేను స్థాపించిన 'స్వరఝరి' సంస్థకు గత పాతికేళ్లుగా ఆయనే ఆహ్వానపత్రాల పంపిణీదారు. ఒక్కొక్కసారి మా సంస్థ సభ్యులు కొందరు, వార్షిక సభ్యత్వ రుసుమును కూడా ఆయనకిచ్చి, నాకు అందచేయమనేవారు. ఆయన జాగ్రత్తగా ఆ రుసుము నాకు అందచేసి, తిరిగి నేనిచ్చిన రసీదును వారికి ఇచ్చేవరకూ ఇంటికి వెళ్లేవారుకాదు.

ఆయనను అందరూ 'పంతులు' గారని పిలిచేవారు. అసలు పేరు భట్ల పెనుమర్రు రాజన్నపంతులు. 1992 లో 'జాహన్ కొరియర్స్' పేరిట ఆయన స్థాపించిన సంస్థకు ఆయనే మేనేజర్, ఆయనే మెసెంజర్.

సభవారిచ్చిన ఆహ్వానపత్రాలను కట్టకట్టి, తన సైకిల్ కారేజీకి తగిలించుకొని, ఎంతదూరమైనా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి, ఇచ్చేవారు. ఇంతకీ ఆయనకి ఆహ్వాన పత్రం ఒక్కింటికి లభించే వేతనం, కేవలం మూడు రూపాయలు. ఆయన పని ముగించుకొని, ఎండనపడి వచ్చారని, ఆయనకివ్వాల్సిన రొక్కంకన్నా ఎక్కువ, ఏరోజైనా ఇవ్వబోతే... వద్దంటూ 'ఒక్క గ్లాసు మజ్జిగ ఇప్పించండి' అని అడిగి, అది మాత్రమే తీసుకొనేవారు...

ఆయన తన ఉద్యోగాన్ని మొక్కుబడిగా కాక, ఇష్టంతో చేసేవారు. ఒకసారి నేనడిగాను..' పంతులుగారూ! ఈవయసులో మీరింత కష్టపడటం అవసరమా!' అని. ఆయన నవ్వి,' నాకు కళలంటే ప్రాణ సమానమండి. ఈజన్మకు దేవుడు నాకు ఏ కళలోనూ ప్రావీణ్యమివ్వలేదు. ఈరకంగానైనా కళాసేవ చేసుకొనే భాగ్యమిచ్చాడనుకుంటాను... వయసు మళ్లిందని ఊరికే ఇంట్లో కూర్చొనేకన్నా, ఒంట్లో శక్తి ఉన్నంతవరకూ శ్రమపడితే ఆ వచ్చే నాలుగురాళ్లూ నా ఖర్చుకు సరిపోతుందనే స్వార్థంకూడా ఇందులో లేకపోలేదు' అన్నారు.

ఆహ్వాన పత్రాలివ్వటమే కాక, ప్రతి కార్యక్రమానికీ హాజరై, కార్యక్రమాలను ఆస్వాదించి, హాజరు శాతం ఎలా ఉందని పరిశీలించేవారాయన!

తన సంపాదనతో ఏడాదికి ఒక పర్యాయం కాశీకి వెళ్లి, విశ్వనాథుని దర్శనం చేసుకోవటం ఆనవాయితీగా పెట్టుకున్నారాయన. అనేకమార్లు ఆయనకు నాచేతనైన సాయం చేయటం నిజంగా నాఅదృష్టం. బెజవాడలో కొన్ని సంస్థలు ఆయనను సత్కరించాయి. పత్రికలు ఆయన సేవలను కొనియాడాయి.

ఒకసారి, మా 'స్వరఝరి' సభ్యులొకరు 'మాకు ఆహ్వానపత్రాలు ఆలశ్యంగా అందుతున్నాయి' అని నన్ను నిలదీశారు. పంతులుగారిని ఈవిషయమై గట్టిగానే అడిగాను నేను. ఆయన కళ్లవెంట నీరు తిరిగింది.' నేనూ పెద్దవాణ్ణి అయ్యాను కదండీ! ఆయన ఉండే పై అంతస్థుకు మెట్లెక్కి వెళ్ళి, నెలనెలా ఇవ్వలేక అపార్ట్మెంట్ క్రింద పోస్ట్ బాక్స్‌లో వేస్తున్నానండి. ఆయన, వెంటనే చూసుకోకపోతే అది నాతప్పెలా అవుతుంది?' అన్నారు.

ఆయనను బాధపెట్టినందుకు ఎంతో నొచ్చుకొని, ఫిర్యాదు చేసిన సభ్యుని పేరును నా జాబితానుండి తొలిగించాను.

తెల్లని గెడ్డం, తెల్లని పాంటు, తెల్లని షర్టుతో తలపై ఒక కేప్ పెట్టుకొని, కేరేజికి ఆహ్వానపత్రాల సంచీ తగిలించుకొని, సైకిల్ తొక్కుతూ గమ్యంకేసి నిదానంగా సాగిపోయేవారు పంతులుగారు.

28-1-18నాడు, పంతులుగారిక లేరనే వార్త విని, దిగ్భ్రాంతి చెందాను... గుండె బరువెక్కింది. బెజవాడ కళాసంస్థలకు మరొక కొరియర్ బోయ్ దొరకవచ్చేమో గానీ, పంతులుగారి లాంటి మనసున్న కళారాధకులు దొరకరు. మౌనంగా ఆయన ఆత్మకు ప్రగాఢ నివాళి అర్పించాను... ●


భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
అంబికా దర్బార్‌బత్తి




Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

# ఓలేటి వెంకటేశ్వర్లు గారు

'నిద్దుర నిరాకరించి, ముద్దుగ తంబుర బట్టి, శుద్ధమైన మనసుతో, సుస్వరముతో, పద్దు తప్పక భజియించే'...తోడిరాగంలోని ఈ త్యాగయ్య కృతి వినగానే, నాకు ఒక గాయకుని ఆకృతి మదిలో మెదలుతుంది. ఆయనెవరో కాదు... నిండైన విగ్రహంతో, ధవళ వస్త్రధారులై, తంబుర చేతబూని, కనులు మూసుకొని, తాదాత్మ్య స్థితిలో, గానాంబుధిలో తనిసి, తరించే ఓలేటి వేంకటేశ్వర్లుగారు.



ఒక విలక్షణమైన సంగీతం ఆయనది... గ్రీష్మఋతువులాంటి వెచ్చనైన కర్ణాటక సంగీతం పాడుతూ, అలవోకగా శరదృతువులో ప్రవేశించి, చల్లని వెన్నెలలాంటి హిందుస్థానీ సంగీతాన్ని స్పృశించి, పరవశింపజేయగల సవ్యసాచి ఆయన!

ఆయనకున్న స్వరజ్ఞానం అనన్యసామాన్యం. రేడియోలో ఎవరయినా ఒక కీర్తన పాడుతుంటే, వింటూ, అదే వేగంతో ఆ సాహిత్యాన్ని స్వరసహితంగా వ్రాసేసేవారాయన!..

పుట్టింది– 27–8–1928న, రాజమహేంద్రిలో. సంగీతంలో తొలి పాఠాలు నేర్చింది – అచ్యుత రామయ్య శాస్త్రి, మునుగంటి వెంకటరావు పంతులు గార్ల వద్ద. అయితే, ఆయనకు బాణి నేర్పినవారు డా॥ శ్రీపాద పినాకపాణిగారు. 'ఓలేటిలాంటి ప్రజ్ఞాశాలి ఇక పుట్టడు' అంటారు గురువు పాణిగారు.

బెజవాడ ఆకాశవాణి చేసుకున్న అదృష్టమేమిటో! ఓలేటిగారి వంటి స్రష్టలను అక్కున చేర్చుకుంది. 1966లో రేడియో ప్రవేశం చేసిన నాటినుండి, సంగీత ప్రయోక్తగా ఆయన నెరపని సంగీత ప్రక్రియలేదు. 'భక్తిరంజని' కోసం ఎంతో ప్రయాసకోర్చి, ఆధ్యాత్మరామాయణ కీర్తనలను సేకరించారు. సదాశివబ్రహ్మేంద్ర సరస్వతి కీర్తనలను, నారాయణతీర్థ తరంగాలను స్వరపరచి, పదిలపరిచారు. ఎన్నో యక్షగానాలకు రూపునిచ్చారు. లలితగీతాలకు బాణీలు కట్టారు. ఆయన పాడిన 'హనుమాన్ చాలీసా' బహుళ ప్రసిద్ధమైనది. 'నగవులు నిజమని', 'కందర్ప జనక' లాంటి అన్నమయ్య కీర్తనలను, 'మనసౌనే ఓ రాధ', 'తలనిండ పూదండ' వంటి లలితగీతాలను, 'భజోరే భయ్యా'... వంటి హిందీ భజన్లు, స్వరపరచి, ఆలపించారాయన.

హిందుస్థానీ సంగీత దిగ్గజం– బడేగులాం ఆలీఖాన్, ఆయనకు దైవ సమానులు. ఒకమారు ఖాన్ గారు హైదరాబాదులో కచేరీ నిమిత్తం వచ్చినపుడు వారి దర్శనం చేసుకున్న ఓలేటిగారు, 'మీరు అనుమతిస్తే..మీరు రికార్డులో పాడిన ఒక ఠుమ్రీని పాడి, వినిపిస్తాను' అన్నారట. 'పాడమని' సంజ్ఞ చేశారు ఖాన్ సాహెబ్. అంతే... ఓలేటిగారు కనులు మూసుకొని, గానం ఆరంభించారు. ఖాన్ గారితో సహా అక్కడ ఉన్న యావన్మందీ మంత్రముగ్ధులయ్యారు. గానం పూర్తి అయింది. ఖాన్ సాహెబ్ ఓలేటిగారితో 'నిజంగా ఆ రికార్డులో నేనింత బాగా పాడానా!' అన్నారట ఆనందంగా...

ఓలేటిగారు, ఖాన్ గారికి ఎంత అభిమాని అంటే... తన గాత్రాన్నే కాదు, శరీరాకృతిని కూడా ఖాన్ గారిలా మార్చుకున్నారేమో! అనిపించేది...

ఓలేటిగారు నిగర్వి, అల్పసంతోషి. 'ఒక బహుళ అంతస్థుల భవంతి, తానే గొప్పని,ఎత్తైనదానినని విర్రవీగితే, ఏంలాభం? చిన్న పిట్ట ఎగిరి, దాని నెత్తిమీద కూర్చోదుటండీ! ఈనాటి ప్రతిభావంతులైన పిల్లలు పాడుతున్న సంగీతం ముందు, మన సంగీతమెంత సార్..?' అనేవారు మిత్రులతో ఆయన.

నిజం చెప్పాలంటే, ఆయనకు తెలుగునాటకన్నా, తక్కినచోట్లనే అభిమానులు మెండు. మద్రాసు మ్యూజిక్ అకాడెమీలో ఆయన చేసిన చిట్టచివరి కచేరీ వినే అదృష్టం కలిగింది నాకు. వరాళి రాగం ఆనాటి ప్రధానాంశం. రసప్రవాహమై సాగిన నాటి కచేరీ అనంతరం, అసంఖ్యాక శ్రోతలు వేదికపైకి తోసుకొచ్చి, వోలేటిగారి పాదాలను తాకి నమస్కరించిన దృశ్యం నేను మరువలేను. ఆనాడు కోయంబత్తూరు వంటి దూర నగరాలనుండి వచ్చిన సంగీత సభానిర్వాహకులు ఎందరో, తమ సభలో కచేరీ చేయవలసిందిగా అర్థిస్తే, 'నేను ప్రయాణం చేసి రాలేనని' సున్నితంగా వోలేటిగారు తిరస్కరించటం ఇంకా గుర్తుంది నాకు.

అదే..ఓలేటిగారి కచేరీ, ఒకసారి బెజవాడ రోటరీ ఆడిటోరియంలో జరిగితే... పట్టుమని పాతిక మంది లేరు. కనులు మూసుకొని తన పాటలో లీనమైపోయిన ఓలేటిగారిని చూస్తే నాకప్పుడనిపించింది... 'ఏ శ్రోతలు వింటున్నారని కొమ్మ గుబురుల్లో దాగి, అంత కమ్మగా కోయిలమ్మ పాడుతుంది?' అని.

ఓలేటిగారు రేడియోలో నిర్వహించిన 'సంగీత శ్యామల' అనే రూపకంలో చిన్నప్పటి శ్యామశాస్త్రి పాత్రలో నటించే అవకాశం వచ్చింది నాకు. అప్పుడు నాకు పధ్నాలుగేళ్ళు. నాటరాగంలో బీజాక్షరాలతో కూడిన ఒక శ్లోకం పాడవలసి వచ్చింది. రాగం మీదే దృష్టి పెడుతూ, శ్లోకం అనలేక పోతున్న నాతో, 'నువ్వు రాగం గురించి ఆలోచించకు. అది ఎలాగూ తప్పురాదు నీకు. ఉచ్చరించే అక్షరాలపై మనసుపెట్టి చూడు' అన్నారాయన. ఆశ్చర్యం!అది పాటించిన వెంటనే ఆశ్లోకాన్ని దోషరహితంగా పాడగలిగాను. నా గాత్రాన్ని మెచ్చుకొని, నన్ను ప్రోత్సహించేవారాయన.

ఓలేటిగారికి ముఖతః పెద్దగా శిష్యులు లేరనే చెప్పాలి. అయితే,బెజవాడ రేడియోలో సుదీర్ఘ కాలం ఆయన నిర్వహించిన 'సంగీత శిక్షణ' ప్రసారం కోసం, తమిళనాట కూడా విద్యార్థులు ఎదురుచూసేవారు. కొన్ని వందల కృతులు ఆవిధంగా ఆయన నేర్పారు. రేడియో వారి 'వాణి' అనే పక్షపత్రికలో ఆ కృతుల స్వరలిపి ప్రచురింపబడేది.

మెహ్దీ హసన్, గులాం ఆలీ గజల్స్ అంటే ప్రాణమిచ్చేవారాయన! ఆ గాయకులు ఆలపించిన బాణీలకు రజని, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గార్లవంటి కవులచే సాహిత్యం వ్రాయించుకొని, పాడేవారాయన!

కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు,'సంగీత చూడామణి','సుర్ సింగార్' బిరుదులు మాత్రం లభించాయి ఆయనకు. ప్రఖ్యాత వైలిన్ విద్వాంసులు లాల్గుడి జయరామన్ గారు, ఓలేటిగారి కోరిక మేరకు 'పహాడి' రాగంలో తిల్లానా రచించారు.

29–12–1989 న తనువు చాలించిన ఓలేటి వేంకటేశ్వర్లు గారిని తెలుగు రాష్ట్రాలవారు మరచినా, నరేంద్రనాథ్ మీనన్ గారి వంటివారు వారిని సంస్మరించు కుంటూ తమిళనాట, ఈనాటికీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**– మోదుమూడి సుధాకర్**

# భాగవత ప్రశస్తి - ప్రాభవం

తెలుగునాడులో పోతన భాగవతానికి ఉన్నంత ప్రచుర ప్రచారం మరే ఇతర గ్రంథానికీ లేదు. పోతన పద్యమాధుర్యం దానికి ప్రధానకారణం. భాగవతమంతా మందారమకరందమే. అర్థగాంభీర్యంతోపాటు శబ్దాలంకారాలు శ్రవణపేయంగా ఉండడంకూడ భాగవతశైలి పాఠకులను ఎక్కువగా ఆకట్టుకుంటుంది. భీష్మస్తుతి, కుంతీస్తుతి మొదలయిన స్తోత్రాలు ఇదివరలో భక్తులు వేకువన శపారాయణం చేసేవారు.

**తే. చేతులారంగ శివుని పూజింపడేని –1.14**
**శా. శ్రీకృష్ణా!యదుభూషణా! నరసఖా! –1.200**
**ఉ. ఎవ్వనిచే జనించు –8–73**
**క. నీ పాదకమల సేవయు**
**శా. నీ పద్యావళులాలకించు చెవులున్**

మొదలయిన పద్యాలు చదువుతూ గృహిణులు పిల్లలకు చెప్పి వల్లె వేయించేవారు. శత్రుపీడా నివారణంకోసం నారాయణకవచం పారాయణం చేస్తారు. ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షణం, వామనచరిత్ర చాలా మందికి కంఠస్థాలు. పెళ్ళికాని కన్యలకు శీఘ్రంగా వివాహం కావడానికి రుక్మిణీకల్యాణం చదివించేవారు. కృష్ణాష్టమినాడు, కృష్ణజననాన్ని పురాణంగా చెప్తారు. వినాయక చవితినాడు శ్యమంతకోపాఖ్యానం చదివేవారు/వినేవారు. క్షీరాబ్ధి ద్వాదశినాడు అంబరీషోపాఖ్యానం పఠించడం పరిపాటి.

సమర్పణ
భాగవత శ్రీచరణ రేణువు
**వైద్యంవేంకటేశ్వరాచార్యులు**

# దొంగలు పడ్డారు!

ఒక కవి ఇంట్లో

దొంగలు పడ్డారు! ఆరు వారాల నగలు, మూడు లక్షల నగదు, ఐదు పుస్తకాలు పోయాయి!!

పుస్తకాలది ఏముందయ్యా...నగలు నగదు చోరీ జరిగిందని కేసు నమోదు చేసుకున్నాడు పోలీసు.

పోలీసుల దర్యాప్తు జరుగుతోంది..నెలలు గడుస్తున్నా జాడలేదు...ఇక వడిసెను సుమతీ అనుకున్నాడు కవి....

ఐదు నెలల తర్వాత ఇంటికి ఒక పార్సిల్ వచ్చింది.. అందులో నగలు నగదు భద్రంగా పంపించారెవరో...కవి గారి భార్య పిల్లలు వాటిని కళ్ళకు అద్దుకుని ఆనందించారు...

పుస్తకాలు పోతేపోయినయి... సొమ్ము దొరికింది అంతే చాలు అన్నారు భార్యాపిల్లలు..

ఆ పుస్తకాలు నా పంచప్రాణాలు అన్నాడు కవి...

"పోద్దురు బడాయి"

"పదేళ్లు కష్టపడి ఐదు పుస్తకాలు రాశానే... అవి నా పంచప్రాణాలు... పంపించినవాడు పుస్తకాలు పంపించి... నగదు నగలు పంపించకపోయినా బాధపడక పోయేవాడిని... కష్టపడితే సొమ్ము సంపాదించగలను... మళ్ళీ ఆ పుస్తకాలు రాయలేనే...అవి సరస్వతీ దేవి అమ్మవారు" ... ఎడ్వడం మొదలెట్టాడు.

"నీ పుస్తకాలు సరస్వతీదేవీ ఐతే.. నా నగలు నగదు సాక్షాత్తు లక్ష్మీదేవి.. ఆ దొంగేవడో పిచ్చోడు" ఆనంద పడింది.ఇంతలో ఆ పార్సిల్లో ఒక కవర్ కనిపించింది.దాన్ని చించి అందులోని చీటి ఆసక్తిగా చదవడం ప్రారంభించింది ఆవిడ.

**కవి గారికి నమస్కారములు...**

బీరువా తాళాలు పగులగొట్టి చూశా... నగలు నగదు పక్కన పుస్తకాలు కనిపించగానే ఇవేవో ఖరీదైనవని భావించి దోచుకెళ్లా..బీరువాలో ఎందుకు దాచారు... వీటిలో నిధి రహస్యాలు ఏమైనా ఉన్నాయేమోనని ఓపిగ్గా వాటిని చదివా... నగదు నగలుకన్నా గొప్ప నిధి దొరికింది... అది జ్ఞాన నిధి... తప్పు చేశానని తెలుసుకున్నా..

ఈ లోగా నా భార్య పాతికవేలు ఖర్చుచేసింది.. చమటోడ్చి సంపాదించి కొద్దినెలల్లో మనియార్డర్ చేస్తా..డబ్బుతో పాటు పుస్తకాలు పంపిస్తా.. ఐతే వాటి జిరాక్స్ ప్రతులు మాత్రం తీసుకుని నావద్ద ఉంచుకుంటా... వాటిని మా పిల్లలతో పాటు తోటివారితో చదివిస్తా.. ఒకవేళ పుస్తకాలు దొంగిలించకపోతే నగలు నగదు తిరిగి పంపించేవాడినికాదు.. ఇప్పుడు నా దృష్టిలో నగలు నగదు కన్నా పుస్తకాలే విలువైనవిగా కనిపిస్తున్నాయి...ఈ రోజు నుంచి దొంగతనాలు మానేస్తున్నా... పుస్తకాలు అచ్చేసుకునేందుకు తోచిన డబ్బుకూడా మీకు పంపించే ప్రయత్నం చేస్తా...

ఇట్లు

**దొంగతనాలు మానిన దొంగ**

ఇప్పుడు కవి ముఖంలో ఆనందం...
ఆయన భార్య ముఖంలో ఆలోచనలు.
లక్ష్మీదేవి గొప్పదా?
సరస్వతీ దేవి గొప్పదా?
ఎంత చక్కని కధ. రచయితకు అభినందనలు.

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# మిత్రుని సలహా

దుర్గాదాసు బాగా సొమ్ములు ఉన్న రైతే కాని వొట్టి సోమరి. అతను పొలం పనులకు రోజూ వెళ్లేవాడు కాడు. ఆవులు,గేదెల గురించి అసలే పట్టించుకోనేవాడు కాడు. ఇక ఇంట్లో ఏ వస్తువులు వున్నాయో, ఏవి అయిపోయాయో చూసు కొనేవాడు కూడా కాడు. అన్ని పనులూ నౌకర్లకే వదిలి పెట్టేవాడు. అతని బద్ధకం, అలక్ష్యంవల్ల ఇంటి పరిస్థితి అధ్వానమై పోయింది.

అతనికి పొలాలవల్ల నష్టం రాసాగింది. పాడివల్ల కూడా చెప్పుకోదగ్గ లాభం వచ్చేదికాదు. ఓరోజు మిత్రుడు హరిశ్చంద్రుడు అతని ఇంటికి వచ్చాడు. అతను దుర్గాదాసు ఇంటి పరిస్థితిని జాగ్రత్తగా గమనించాడు. సోమరి పోతైన దుర్గాదాసు చెప్తే విని, తన స్వభావం మార్చుకొనేవాడు కాదని అతనికి తెలుసు. ఎలాగైనా స్నేహితునికి మేలు చేయాలని ఆలోచించి దుర్గాదాసుతో ఇలా అన్నాడు "మిత్రుడా! నీ కష్టాలు చూస్తుంటే నాగుండె తరుక్కుపోతూ ఉంది. నీ దారిద్ర్యం పటాపంచలయ్యే ఓ మంచి ఉపాయం చెప్తాను."

"బాబ్బాబూ! ఆ ఉపాయం చెప్పి కాస్త పుణ్యం కట్టుకో కూడదూ? నీవు చెప్పినట్లే తప్పకుండా నడుచుకొంటాను" అని దుర్గాదాసు మిత్రునితో అన్నాడు.

హరిశ్చంద్రుడు "పక్షులు లేవకముందే మానస సరోవరంలో వుండే ఓ హంస ఈ భూమిమీదికి వస్తుంది. అది ఎప్పుడు వస్తుందో, ఎక్కడ వాలుతుందో ఎవరికీ తెలియదు. కానీ ఆ హంసను దర్శనం చేసుకొనే వాళ్లకు ఎలాంటి లోటూ వుండదు."

దుర్గాదాసు "ఏమైనా సరే, నేను ఆ హంసను తప్పక చూడాలి' అని నిశ్చయించున్నాడు. హరిశ్చంద్రుడు వెళ్లిపోయాడు. దుర్గాదాసు మరుసటిరోజు కోడి కూయక ముందే లేచాడు. ఇల్లు దాటి, హంసను వెతుక్కొంటూ పొలంవైపు వెళ్లాడు. అక్కడ పక్కపొలం యజమాని దుర్గాదాసు ధాన్యం కుప్పనుంచి ధాన్యాన్ని తన కుప్పలోకి ఎత్తి పోసుకోవడం చూసాడు. దుర్గా దాసును చూడగానే అతను సిగ్గుతో తలవంచుకొని, క్షమించమని ప్రార్థించాడు. పొలంనుంచి అతను ఇంటికి తిరిగొచ్చాడు. గోశాల వైపు వెళ్లాడు. అక్కడ పసువుల కాపరి ఆవుపాలు పిండి, అతనిభార్య తెచ్చిన పాత్రలోకి వంచుతుండడం చూసాడు. దుర్గాదాసు అతన్ని మందలించాడు. ఇంట్లో ఫలహారం సేవించి హంసను వెతుకుతూ బయలుదేరాడు. పొలంవైపు వెళ్ళాడు. పొలం పని చేయటానికి కూలీలు ఎవరు రాలేదు. అతను అక్కడే కాసేపు ఆగాడు. కూలీలు వచ్చిన తర్వాత వాళ్లను మందలించాడు. ఇలా అతను వెళ్లిన చోటెల్లా, కొంతకు కొంతైనా నష్టం ఆగిపోయింది.

దుర్గాదాసు ప్రతిదినమూ ఉదయమే నిద్రలేచి హంసను వెతుక్కొంటూ వెళ్లేవాడు. పొలాల్లో తిరిగేవాడు. అతను దినమూ రావడం చూసి నౌకర్లు, కూలీలు పనీపాటలు శ్రద్ధగా చెయ్యడం మొదలెట్టారు. అతని పొలాల్లో, ఇంట్లో జరిగే చిల్లరమల్లర దొంగతనాలు నిలిచి పోయాయి.

మొదట్లో అతను ఏదో రోగం వచ్చిన వాడిలా కనపడేవాడు. ఇప్పుడు ఆరోగ్యం చేకూరింది. అతనికి మునుపు పొలాల్లో వచ్చే పంటకంటే ఇప్పుడు ఇబ్బడి ముబ్బడి రాసాగింది. ఆవులు, గేదెల నుంచి పాలు ఎక్కువగా రాసాగాయి.

ఓ రోజు హరిశ్చంద్రుడు మిత్రుడైన దుర్గాదాసుని చూడాలని వచ్చాడు. దుర్గాదాసు స్నేహితునితో ఇలా అన్నాడు "మిత్రుడా! నాకు ఇంతవరకు హంస కనపడలేదు. కాని, దాన్ని వెతకడంలో నాకు ఎంతో మేలు కలిగింది".

హరిశ్చంద్రుడు నవ్వి ఇలా అన్నాడు 'హంస అంటే మరేమిటో అనుకొన్నావు కాబోలు? కష్టపడటమే తప్ప మరేమి కాదు. రెక్కల కష్టం వూరకేపోదు. తన పని తాను చేసుకోకుండా, ఇతరులకు వదిలి పెట్టినవాడు ఎప్పుడూ నష్టపోతాడు. సొంతంగా రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడేవాడు నౌకర్లపై ఆజమాయిషీ చేస్తూ ఉంటే సిరిసంపదలు, గౌరవమర్యాదలు పొందగలుగుతాడు."

**నీతి : కష్టానికి ఫలం తప్పక దొరుకుతుంది.**

# శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం పొందడం ఎలా ?

సర్వ సంపదలకూ అధినేత్రి లక్ష్మీదేవి. ఆమె కరుణ లేకపోతే ఎంతటి గొప్పవాడైనా దరిద్రుడిగా జీవించవలసిందే. ఆ చల్లని తల్లి అనుగ్రహం కలిగితే అక్షరం ముక్క రాని వాడు కూడా అష్టైశ్వర్యాలూ అనుభవిస్తాడు. ఆమె ఇష్టాయిష్టాలు తెలుసుకుని, అందుకు తగ్గట్లుగా నడుచుకుంటే ఆమె కృపతో అందరూ హాయిగా జీవించవచ్చు.

1. గుమ్మానికి పక్కనే చిందరవందరగా పాదరక్షలను విడవడం, గుమ్మాన్ని కాలితో తొక్కి లోపలకు రావడం లక్ష్మీదేవికి ఇష్టం ఉండదు. అందుకే పెద్దలు ఆ పనులు చేయనివ్వరు.
2. సూర్యోదయ, సూర్యాస్తమయాలలో నిద్రించే వారు, భుజించేవారు, పగటిపూట నిద్రించేవారు లక్ష్మీదేవి కృపకు నోచుకోరు.
3. శుచి, శుభ్రత, సహనం కలిగి, ధార్మికంగా, నైతికంగా జీవించేవారు లక్ష్మీదేవికి ఇష్టులు.
4. చిల్లర పైసలను, పువ్వులను నిర్లక్ష్యంగా పడేసేవారు, ముక్కోపులు, దురహంకారులు లక్ష్మీదేవి అనుగ్రహానికి దూరంగా ఉంటారు.
5. బద్ధకస్తులు, అతిగా మాట్లాడేవారు, అమితంగా తినేవారు, గురువులనూ, పెద్దలనూ అవమానించేవారు, అపరిశుభ్రంగా ఉండేవారు, జూదరులు, అతినిద్రాలోలు ఇంటి ముంగిటికి కూడా లక్ష్మీదేవి కాలిడదు.
6. లక్ష్మీదేవి అనుగ్రహం పొందాలంటే ఆకుపచ్చని వస్త్రాలను ధరించి, ఆమెకు ఎర్రని వస్త్రాలను, పరిమళభరితమైన పూలను అలంకరించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించి, పాలు, పాలతో చేసిన పదార్థాలను నివేదించడం శ్రేష్ఠం.
7. బంగారాన్ని నడుం కింది భాగంలో ధరిస్తే లక్ష్మీదేవిని కించపరచినట్లే. అందుకే కాళ్లపట్టాలు, మట్టెలూ వెండివి మాత్రమే ధరించాలి
8. ఉసిరిపొడిని నీటిలో కలిపి తలస్నానం చేసి, శుచీశుభ్రతలతో దేవీభాగవతం లోని మహాలక్ష్మి క్షీరసాగరం నుండి ఆవిర్భవించిన భాగాన్ని అధ్యయనం



చేయడం వల్ల పోయిన సంపదలన్నీ తిరిగి లభిస్తాయని శాస్త్రోక్తి.

9. లక్ష్మీదేవికి నివేదించే పిండివంటలను నూనెతో కాకుండా నేతితో తయారు చేస్తే శ్రేష్ఠం.
10. ఇంట్లో లక్ష్మీదేవి నిలబడి ఉన్న పటం కాకుండా పద్మంలో కూర్చున్న పటం ఉంచుకోవాలి.
11. శ్రీలక్ష్మీ క్షమాగుణం, శాంత గుణం అనే ఆరెండు గుణాల్లో ఉంటుంది. ఈ రెండు గుణాలు ఉన్నవార్ని లక్ష్మీదేవి సదా అనుగ్రహిస్తుంది ●

# తెలుగు భాషకు సంబంధించిన ఓ మంచి సమాచారం...

తక్కువగా వాడెడి తెలుగు వాడి
అర సున్న 'c'
'బండి ర – 'ఱ' లు'

నేటి తెలుగు భాషలో ఇవి దాదాపుగా వాడుకలో లేవు. ఐతే ఇవి తెలుగు భాషకి చాలా ప్రత్యేకమైనవి. కావ్య భాషలోను, లక్షణ శాస్త్రంలోను వీటి ప్రాముఖ్యం చాలా వుంది. వీటి గురించి ఆంధ్రులు తెలుసుకోవాలి... ఖచ్చితంగా నేర్చుకోవాలి...

'అర సున్న, 'ఱ' ల వల్ల అర్థములో వచ్చే తేడాను గమనించండి.'

'ఉదా':–

'అరుంగు' – వీధి అరుగు
'అరుగు' – వెళ్ళు, పోవు
'అఱుగు' – జీర్ణించు
'ఏఁడు' – సంవత్సరం
'ఏడు' – బాధం7 సంఖ్య
'కరి' – ఏనుగు
'కఱి' – నల్లని
'కాఁపు' – కులము
'కాపు' – కావలి
'కాఁచు' – వెచ్చచేయు
'కాచు' – రక్షించు
'కారు' – ఋతువు కాలము
'కాఱు' – కారుట (స్రవించు)
(కారు – వాహనం – ఆంగ్ల పదము)
'చీఁకు' – చప్పరించు
'చీకు' – నిస్సారము, గ్రుడ్డి
'తఱఁగు' – తగ్గుట
'తఱుగు' – తరగటం (ఖండించటం)
'తరి' – తరుచు
'తఱి' – తఱచు
'తీరు' – పద్ధతి
'తీఱు' – నశించు
'దాఁకc' – వరకు
'దాక' – కుండ, పాత్ర
'నాఁడు' – కాలము
'నాడు' – దేశము, ప్రాంతము
'నెరి' – వక్రత
'నెఱి' – అందమైన
'నీరు' – పానీయం
'నీఱు' – బూడిద
'పేఁట' – నగరంలో భాగము
'పేట' – హారంలో వరుస
'పోఁగు' – దారము పోఁగు
'పోగు' – కుప్ప
'బోటి' – స్త్రీ
'బోఁటి' – వంటి 'నీబోఁటి'
'వాఁడి' – వాఁడిగా గల
'వాడి' – ఉపయోగించి
'వేరు' – చెట్టు వేరు
'వేఱు' – మఱొక విధము

'మన భాషను ప్రేమిద్దాం....మన భాషను గౌరవిద్దాం...మన భాషను సవ్యంగా మాట్లాడదాం... ●

# నేటి పిల్లల పెంపకం - సవాళ్ళు

ప్రస్తుత తరంలో పిల్లల పెంపకం పెద్ద సవాలుగా మారుతోంది. తల్లిదండ్రులు ఈ విషయంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇద్దరు బిడ్డల తల్లిగా, మావారి బదిలీల మూలంగా, నేను కూడా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో నివసించి, అక్కడి స్కూళ్లలో మా పిల్లలు ఎదుర్కొన్న సమస్యలు ఏమిటో గుర్తించాను. అవి మీతో పంచుకోవాలని ఈ చిన్న ప్రయత్నం. ఆ ప్రయత్నంలోకి అలా వెళ్లేముందు అందరూ గుర్తుంచుకోవాల్సిన ఒక మాట చెప్తాను – 'మార్పు అనేది రెండు వైపుల నుంచి రావాలి ఒక చేత్తో కొట్టేవి చప్పట్లు కాలేవు.'

ప్రస్తుతం మనం భారతీయ నాగరికత, పాశ్చాత్య నాగరికతల మధ్య ఒక సంధికాలంలో ఉన్నామని చెప్పుకోవచ్చు. దీనికి కారణం ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన విద్యా విధానం కావచ్చు లేక జీవన విధానం కూడా కావచ్చు. కానీ కారణాలేవైనా మన పిల్లలను, మన సంస్కృతి మర్చిపోకుండా పెంచడం మాత్రం చాలా ముఖ్యం. ఇందుకోసం తల్లిదండ్రులు తమ పిల్లల్ని అనుక్షణం కనిపెట్టుకుని ఉండడం అనేది చాలా అవసరం. కానీ తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయడం, పిల్లలకు సులువుగా గ్యాడ్జెట్స్ అందుబాటులో ఉండడం, వేరు కాపురాలు ఎక్కువవడం, వంటి అంశాల వల్ల ప్రస్తుతం పిల్లలపై పెద్దల పర్యవేక్షణ తగ్గిపోతోంది. అటువంటి తరుణంలో ఇంటా బయటా నేటి తరం పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో చూద్దామా.

పీడించడం : 'పరోపకారం పుణ్యం పరపీడనం పాపం' అన్నది మన సంస్కృతి. కానీ ప్రస్తుత తరంలో ఇతరులను పీడించి ఆనందించడం అన్నది ఎల్కేజీ నుంచే పిల్లలకు ఒక అలవాటుగా మారుతోంది. బలవంతుడు బలహీనుడిని అణగదొక్కడమన్నది ఎన్నో తరాలుగా మనం చూస్తున్నదే. కానీ ఈ ప్రవృత్తి పిల్లల్లో కూడా పెరగడం చాలా శోచనీయమైన అంశం. ఇక్కడ మరొక కీలకమైన విషయం కూడా ఉంది. ఎప్పుడూ బిజీగా ఉండే పెద్దలకు, తమ స్కూల్లో వేరే పిల్లల నుంచి తాము మానసికంగా, శారీరకంగా ఎదుర్కొంటున్న సమస్యలు చెబితే ఎక్కడ విసుక్కుంటారోనని భయపడి, కొంత మంది పిల్లలు అటువంటి విషయాలను తమలో తామే దాచుకుంటారు. కొన్నాళ్ళకి; వీరికి స్వపీడన పరాయణత్వం (masochism) అలవాటైపోతుంది. కానీ దీనివల్ల కొంతకాలానికి వారు నిరాశకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. అందుకే ఎంత బిజీగా ఉన్నా సరే, రోజుకు ఒక పావుగంటయినా పిల్లలతో గడిపి, వారు స్కూల్లో ఏం చేస్తున్నారో పెద్దలు అడిగి తెలుసుకోవడం అత్యంత ప్రధానమైనది. పరపీడనత్వం (sadism), స్వపీడనత్వం వంటి అలా తెలుసుకుంటున్న సమయంలో వారి మూడ్ ఎలా ఉందో పెద్దలు గమనించాలి. అవసరమైతే, క్లాస్ టీచర్ ను కూడా సంప్రదించడం, తమ పిల్లల్ని ఎవరూ వేధించకుండా చూసుకోవడం, చాలా ముఖ్యం.

ఎదిరించి మాట్లాడడం : మన కాలంలో పెద్దలను ఎదిరించి ఒక్కమాట మాట్లాడాలంటే భయపడే వాళ్ళం. కానీ ఇప్పటి పిల్లలకి వీళ్ళు వాళ్ళు అన్న లెక్క లేదు. తమను ఆటపట్టించబోతే ఎవరినైనా సరే, గబుక్కున దురుసుగా మాట్లాడేస్తారు. ముఖ్యంగా అంతగా చనువులేని కొత్త వాళ్ళు తమని ఆటపట్టించడాన్ని పిల్లలు హర్షించరు. ఇది కూడా ఒకందుకు మంచిదే. మునుముందు జీవితంలో ఇతరులు తమను ఇష్టమొచ్చినట్లు మాట్లాడాలని చూస్తే, ముఖం మీదే తెగేసి చెప్పడం తద్వారా పిల్లలు తమను తాము రక్షించుకోగలుగుతారు. పిల్లలు ఎవరినీ లక్ష్యపెట్టకుండా ఉండే ఈ వైఖరిని స్కూల్లో నుంచే అలవరచుకుంటున్నారని మనం గమనించాలి. అందుకే శృతిమించినప్పుడు సున్నితంగా మందలించాలి. ఇప్పటి తరాన్ని బెదిరించడం, కొట్టడం వల్ల ఉపయోగం లేదు. ప్రేమగా, లాలనగా ఒక విషయాన్ని ఒకటికి పది సార్లు ఓపిగ్గా చెప్పాలి, అప్పుడు ఖచ్చితంగా మార్పు వస్తుంది.

మార్కులు మాట్లాడతాయి: ఇప్పుడు మార్కులు మాట్లాడుతాయి, మార్కులే గౌరవాన్ని ఆపాదించి పెడతాయి. మార్కులను బట్టి వేరే పిల్లలు కూడా స్కూల్లో మన పిల్లల్ని గౌరవిస్తారు. పిల్లల దాకా ఎందుకు? కొంతమంది టీచర్లకు కూడా మార్కులు, టార్గెట్లే లక్ష్యం . అందుకే మార్కులు బాగా వచ్చే పిల్లలు ఇతరుల పై దాడికి తెగబడినా, ఇతరులను హింసించినా కూడా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఈ దేశానికి కావాల్సింది టాపర్లు, ర్యాంక్ హోల్డర్లు మాత్రమే కాదు. మంచి పౌరులు కూడా! ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. అందరూ టాపర్లు కాలేరు. అందరూ డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఐటియన్లు; కాలేరు. కానీ అందరినీ ప్రేమించే మంచి మనసును మనం పిల్లల్లో పెంపొందించగలిగితే, సేవాభావాన్ని బాల్యం నుంచే అలవాటు చేయగలిగితే, వారు నిశ్చయంగా ఈ సమాజానికి మేలు చేసే మంచి పౌరులుగా మారతారు. మనం కూడా ఇతరుల ఇళ్లకు వెళ్లి, వాళ్ళ పిల్లల్ని పలకరిస్తూ ఉన్నప్పుడు గుర్తుంచుకోవాలి. పిల్లల్ని 'ఎన్ని మార్కులు వస్తున్నాయి?' వంటి నిరాశపరిచే ప్రశ్నలు అడక్కూడదు. వారే చెబితే వినడంలో తప్పులేదు. అందుకే మనం పిల్లల్ని మార్కులుగా కాకుండా, భావి పౌరులుగా చూడడాన్ని అలవాటు చేసుకోవాలి. సాంఘిక జీవనంలోని వివిధ దశల్లో వారి ప్రవర్తన ఎలా ఉందో గమనించుకుంటూ, సరిచేసుకుంటూ ఉండాలి.

అవసరానికి మించిన ఆలంబన : మన సంస్కృతిలో పిల్లల చిన్నప్పటి నుంచే వారికి కావలసిన వాటిని అమర్చి పెడుతూ, వెన్నంటే ఉంటూ, అడిగినవి అడగనివి కూడా సమకూర్చడం ఒక అలవాటుగా ఉంది. కానీ ఇలా చేయడం వల్ల మనం వారి వ్యక్తిత్వం రూపుదిద్దుకునే సమయంలో దానికి అవరోధం కల్పించినట్లుగా అవుతుంది. పిల్లలు స్వతంత్రంగా బతకడం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం అనేది చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలి. ఎందుకంటే నేడు విశ్వ వ్యాప్తంగా వ్యాపించిన అవకాశాలు స్వాగతిస్తున్న సమయంలో, ఎల్లవేళలా తల్లిదండ్రులు పిల్లల పక్కనే ఉండి, సమయానికి తగ్గట్టుగా ఏ నిర్ణయం తీసుకోవాలో చెప్పడమనేది కష్టం.

ఈ విషయంలో మీకు ఒక కటువైన వాస్తవ గాథను చెబుతాను. చండీగర్ లో ఉన్నప్పుడు మావారి ఆఫీస్ డ్రైవర్ ఉండేవాడు. మీరట్ లోని సంపన్న కుటుంబానికి చెందిన అతను నిజానికి డ్రైవర్ కాదు. కానీ సైన్యంలో పనిచేసిన అతని కుటుంబంలో అనుకోని ఒక విపరీతం జరిగింది. అతని తల్లి, తండ్రి, అక్క, చెల్లితో సహా 14 మంది కుటుంబ సభ్యులు కేదార్నాథ్ యాత్రకు వెళ్లి వరదల్లో కొట్టుకుపోవడం జరిగింది. దానితో రాజకీయాల్లో ఉన్న అతని బావ, ఆస్తి కోసం ప్రాణాలతో ఉన్న ఇతనొక్కడిని చంపే ప్రయత్నం చేయడంతో చండీగర్ పారిపోయి వచ్చి బ్రతుకుతున్నాడు. ఒక్కసారిగా అంత మంది కుటుంబ సభ్యుల్ని కోల్పోవడం, ఉన్నవారు తనపై హత్యా ప్రయత్నాలు చేయడంతో అతని మనసు విరిగిపోయింది. అయినా అతను ఎప్పుడూ నాతో ఒక మాట అంటూ ఉండేవాడు. 'అమ్మా! పిల్లలకు అన్ని పనులు అలవాటు చేయండి. మా అమ్మ నాకు రొట్టెలు చేయడం, కూర వండడం నేర్పింది గనుక ఇవాళ నేను ఎక్కడో అక్కడ బ్రతుకుతున్నాను, ఇంత వండుకు తినగలుగుతున్నాను. మీరు మీ పిల్లలకు అన్ని పనులు నేర్పిస్తూ, స్వతంత్రంగా ఉండేలా పెంచండి. లేకపోతే జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఎవరూ చెప్పలేరు కదా?' ఈ మాటలు ఇప్పటికీ నా మనసులో; మారు మ్రోగుతూనే ఉంటాయి.

అందుకే మీ పిల్లలకు అవసరానికి మించిన ఆలంబన ఇవ్వకండి. పిల్లలు ఎదుగుతున్న కొద్దీ వంట దగ్గర్నుంచి, వాళ్ళు బ్రతకడానికి అవసరమైన ప్రతి ఒక్క పనిని వారు స్వయంగా చేసుకునేలా జాగ్రత్త తీసుకోండి.

గాడ్జెట్ భూతాలు: హాఫ్ ఇయర్లీ పరీక్షల్లో పాస్ అయితే తన బిడ్డకు ఐఫోన్ కొనిస్తానని చెప్పాడట మా అమ్మాయి క్లాస్మేట్ తండ్రి ఓ పిల్లాడితో. 'అమ్మా! నాకు ఎన్ని మార్కులు వచ్చిన నువ్వేమీ కొనియవు. వాళ్ళ నాన్న చూసావా ఎంత మంచివాడో,' అని అడిగింది మా అమ్మాయి. ప్రస్తుతం పిల్లల్ని ఇంతగా గారం

చేసే తల్లిదండ్రులు ఉన్నారు. అందుబాటులో ఇంటర్నెట్టు, గ్యాడ్జెట్స్ ఉండడం, పిల్లల్లో అనేక వికారాలకు దారితీస్తోంది. పబ్జీ, బ్లూ వేల్, ఆన్‌లైన్ రమ్మీ వంటి ఆటల వల్ల ఎంత మంది ప్రాణాలు కోల్పోయారో తెలిసిందే. అలాగే చిన్న వయసులోనే సోషల్ మీడియా అనుమతించడం వల్ల ఎంత మంది ఆడపిల్లలు వేటగాళ్ల ఉచ్చులో పడ్డారో కూడా మనం పేపర్లలో చదువుతూనే ఉన్నాం. ఆన్‌లైన్, ఆటలు, పరిచయాలు ప్రాణాంతకం కావచ్చు. టాపర్‌గా ఉన్న ఒకబ్బాయి, పబ్జీ ఆటకు బానిసై, నిద్రాహారాలు మాని, బ్రెయిన్ క్లాట్ వల్ల, పక్షవాతానికి గురై, చివరకు సర్జరీ దాకా వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చిందని తాజాగా న్యూస్ పేపర్లు వెల్లడించాయి. కనుక ఒకవేళ హోంవర్కు కోసమో, ప్రాజెక్ట్ వర్కుల కోసమో గ్యాడ్జెట్స్ ను అందించినా కూడా, నియమిత సమయం వరకే వాటిని వాడడానికి ఇస్తూ వెనక్కి తీసుకోవడం అనేది ఎంతో అవసరమైనది.

టీనేజ్ సమస్యలు: టీనేజ్లో పిల్లల సార్ ఈ రకంగా జరిగే మార్పుల వల్ల వారిలో హార్మోనల్ ఇంబ్యాలెన్స్ (హార్మోన్ల అసమతుల్యత) అనేది ఏర్పడుతుంది. తమలో ఏమి జరుగుతోందో తెలియక వచ్చే కొత్త కొత్త మార్పులేమిటో తెలియక, చాలా మంది పిల్లలు దిగులు పడి పోతూ తమలో తామే ఒంటరిగా ఉండిపోతూ, ఆలోచిస్తూ ఉంటారు. ఈ దశలోనే తప్పనిసరిగా ప్రతి ఒక్క విద్యార్థి ఎవరో ఒకరి వల్ల వేధింపులకు గురవుతారు. ప్రేమించమంటూ బెదిరించడం, ఒప్పుకోకపోతే తమకు ఎఫైర్ ఉందని టీచర్ల దగ్గర నుంచి స్కూల్ అంతా ప్రచారం చేస్తామనడం, నయానో భయానో ఒప్పించాలని చూడడం, పిల్లల దశ నుంచే ప్రస్తుతం కొనసాగుతోంది. అంతగా ధైర్యం ఉండని ఆడపిల్లలు ఇంట్లో వాళ్ళతో ఇలాంటివన్నీ పంచుకోలేక ఉన్నట్టుండి డల్‌గా మారిపోతూ ఉంటారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి వారు ఒక బాయ్ ఫ్రెండ్ నో, గర్ల్ ఫ్రెండ్ నో ఎంచుకోవడం, సినిమాల్లో చూపించే బాల్య ప్రేమలు, స్కూలు ప్రేమలో ఉదంతాలు పిల్లలపై ప్రభావం చూపుతున్నాయి. చిన్న వయసులోనే ప్రేమించడం తప్పనిసరి అన్న భావనలు వారిలో నెలకొంటున్నాయి. చివరకు ప్రేమలకు లొంగిన పిల్లల్ని 'లూస్ క్యారెక్టర్%' అని పిల్లల్ని 'పనికిమాలినవారని' కూడా స్కూల్లో చిత్రీకరించడం జరుగుతోంది. పెరిగిన సిలబస్ లు, చదువుల బరువులతోపాటు, అనుకోకుండా ఎదురయ్యే ఇటువంటివన్నీ తల్లిదండ్రులతో చెప్పలేక వాళ్లు లోలోపలే నలిగిపోతుంటారు.

టీనేజ్లో ఉన్న పిల్లలతో పెద్దలు కొంత సమయాన్ని గడుపుతూ, తమ కాలంలో తాము టీనేజ్లో ఉన్నప్పుడు ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యాయో, వాటిని అధిగమించి ఎలా నిలబడగలిగామో చెబుతూ ఉండాలి. ఇటువంటివన్నీ సహజమని, వాటిని తట్టుకుని ముందుకు వెళ్లాలని చెబుతూ ఉండాలి. అంతేకాదు తమ పిల్లలకు ఎటువంటి పరిస్థితులు ఎదురైనా కూడా, తాము వారి వెనకాల దన్నుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసాను ఎప్పటికప్పుడు వారికి కలిగిస్తూ ఉండాలి.

విమర్శలు ఒద్దు– ప్రశంసలు ముద్దు : చాలామంది తల్లిదండ్రులు చేసే తప్పు – పిల్లలను 'నువ్వింతే, నీకేమీ చేతకాదు, ఇలాగైతే నువ్వు జీవితంలో బాగుపడవు' వంటి ప్రతికూలమైన మాటలతో విమర్శిస్తూ ఉండడం. ఇలా మాట్లాడడం, చిన్న చిన్న వాటికి అతిగా కోప్పడుతూ శపించడం వల్ల పిల్లలలో ఉన్న స్ఫూర్తి చచ్చిపోతుంది. అలా కాకుండా, 'ఇది నువ్వింకా బాగా చెయ్యగలవు, నీవు ఇంకొంత కష్టపడాలి,' వంటి సానుకూలమైన మాటలతో పిల్లల్ని దిద్దుకోవాలి. ఆ మాటకొస్తే, పిల్లలేంటి, తప్పులు చెయ్యని పెద్దలు ఎవరైనా ఉంటారంటారా? ఆలోచించండి. మనల్ని ఇతరులు అటువంటి మాటలన్నప్పుడు మనకు ఎలా ఉంటుందో, తగిన పరిణితి లేకపోవడం వలన పిల్లలకు మరింత నిరాశగా ఉంటుంది. అందుకే ఇటువంటి ప్రవృత్తి మానుకోవాలి.

చెడ్డ అలవాట్లు: మా పెద్దమ్మాయికి గతంలో ఒక మంచి స్నేహితురాలు ఉండేది. వాళ్లది సంప్రదాయబద్ధమైన కుటుంబమే. కానీ కొన్నాళ్ళు స్నేహం తరువాత ఆ పిల్ల ఎందుకనో; అప్పటిదాకా స్నేహం చేసిన చాలామందితో మాట్లాడడం మానేసి, కొత్త దారిలో పయనించడం మొదలు పెట్టింది. తాజాగా ఆ పిల్ల ఇన్స్టాగ్రామ్ లో, మరొక అమ్మాయితో కలిసి స్టైల్‌గా సిగరెట్లు ఊదుతున్న ఫోటోలను పెట్టింది. మా అమ్మాయి అది చూపించగానే చూసి, నేను షాక్ ఐపోయాను. అంతేకాదు మందుకు, మాదకద్రవ్యాలకు కూడా ఆమె బానిసైనట్లుగా వినికిడి. అసలే సంబంధంలేని బయట వాళ్ళమయిన మాకే ఇంత బాధగా అనిపిస్తుంటే అమ్మాయి తల్లిదండ్రులు ఎంతగా బాధపడుతూ ఉండాలి? తమ పిల్లలకు మంచి చదువు ఇవ్వాలనే ఉద్దేశంతో, స్తోమత లేకపోయినా తమ అవసరాలు తగ్గించుకుని, కార్పొరేట్ స్కూళ్లలో పిల్లలను చదివిస్తున్న వాళ్లందరూ, ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. సోకాల్డ్ 'హై స్టేటస్' పిల్లలు కూడా మన పిల్లలతో పాటే చదువుకుంటున్నారు. తమ తల్లిదండ్రుల క్లబ్ కల్చర్ మూలంగా వాళ్లు కూడా సిగరెట్టు, మందు వంటి అలవాట్లకు, చేతిలో విచ్చలవిడిగా డబ్బులు ఉండడం వల్ల మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నారు. కానీ వీళ్ల ఇతరుల్ని చెడగొట్టడానికి 'నువ్వు సిగిరెట్ తాగవా? అయితే నువ్వు మగాడివి కాదన్న మాట!' 'నువ్వు మందు రుచి చూడవా, అయితే నీవు స్వలింగసంపర్కివన్నమాట,' వంటి ఇగో మీద దెబ్బ తీసే మాటలు వాడతారని మనం గుర్తుంచుకోవాలి. నలుగురిలో ఇటువంటి మాటలు తమను అనడం తట్టుకోలేని పిల్లలు తేలిగ్గా వీరి ఉచ్చులో పడి పోతున్నారు. మీడియా వారు చెప్తున్నట్టు ప్రస్తుతం అన్ని కార్పొరేట్ స్కూళ్లలోనూ, అన్ని రకాల అలవాట్లలోనూ మన పిల్లలను పడేయాలని చూసే, వేటగాళ్ళు కాచుకుని ఉన్నారు. ఇది కటువైన వాస్తవం. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల్ని అనుక్షణం కనిపెట్టుకుని ఉండడం చాలా అవసరం.

ఈ వ్యాసంలో నేను ఉదహరించినవి కొన్ని సమస్యలు మాత్రమే ! నేడు ఇటువంటి స్థితిగతుల్లో, తులసివనమని భ్రమపడుతూ మన పిల్లల్ని మనం వేస్తున్న గంజాయి తోటల్లో, వారి అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి, మంచి చదువుతో జీవితంలో నిలదొక్కుకోవడానికి పిల్లలు ఎంతగానో మధన పడుతున్నారు. భావి భారత పౌరులను తీర్చి దిద్దడం మన ఇంటి నుంచే మొదలవుతుంది. అందుకే ఈ దిశగా ప్రయత్నాలు చేద్దాము, బంగారు భారతావనికి బాట వేద్దాము. జై హింద్ !

– భావరాజు పద్మిని





# ఆంధ్రా బ్యాంకుకి వీడ్కోలు

**మా** నాన్నగారు శ్రీ బీ. యన్. రఘునాధరావుగారు 1955–56లో ఆంధ్రా బ్యాంకులో మద్రాసు టీ. నగర్ బ్రాంచ్‌లో ఉద్యోగంలో చేరారు. అప్పటికి ఆయనకి ఇంకా పెళ్లి కాలేదు. 1958లో ఆయనకి వివాహం అయింది. 1960లో నేను పుట్టాను. నేను పుట్టిన కొత్తల్లో మా నాన్నగారికి ఆఫీసర్ అయ్యే అవకాశం త్రుటిలో తప్పిపోయింది. దానితో ఆయన మరల ఆఫీసర్ అయ్యే ప్రయత్నం చెయ్యలేదు. చివరికి 1970లో తన సహోద్యోగులు, జూనియర్స్ అందరూ ఆఫీసర్స్ అవడంతో ఆయన అప్పుడు ఆఫీసర్ అయ్యారు. అప్పట్లో ఒక ఊరు నుంచి మరో ఊరు బదిలీలు ఇప్పట్లోలా ప్రతీ మూడు ఏళ్ళకి చేసేవారు కాదు. దానితో మా నాన్నగారు ఆఫీసర్ అయినప్పుడు మద్రాసు టీ. నగర్ బ్రాంచ్ నుంచి జార్జి టౌన్ బ్రాంచ్ కి బదిలీ అయ్యారు.

నాకు ఊహ తెలిసి 1967 నుంచి నేను తరచూ (ముఖ్యంగా వేసవి శలవల్లో) టీ. నగర్ బ్రాంచ్‌కి వెళ్ళేవాడిని. అప్పట్లో టీ. నగర్ బ్రాంచ్ పాండీబజార్‌లో మా రామకృష్ణా మిషన్ హైస్కూల్ (నేను చదివింది అక్కడే ) దాటి అదే వరసలో శివజ్ఞానం వీధికి మలుపు తిరిగే చోట వుండేది. అప్పట్లోనే అది ఒక ప్రాచీన కట్టడం. చుట్టూ బోలెడంత ఖాళీ స్థలంతో అంధ్రా బ్యాంకు కొట్టవచ్చినట్టు ప్రస్ఫుటంగా కనిపించేది. ఏకాంబరం అనే సబ్ స్టాఫ్ ఉండేవాడు. మనిషి నల్లగా వున్నా ఎప్పుడూ తెల్లటి ప్యాంటు, షర్ట్ ధరించేవాడు. కాషియర్ రామారావు, మా నాన్నగారి ఇతర సహోద్యోగులు సుబ్రహ్మణ్యం, దత్తు, రాధాకాంతారావు, విశ్వనాధరావు వుండేవారు. మద్రాసులోని ప్రముఖ తెలుగు సినిమా సంస్థలు, ప్రముఖ నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, ఇతర సినిమా సాంకేతిక నిపుణులు, రచయితలు, గాయనీ గాయకులు అందరు ఆ రోజుల్లో అంధ్రా బ్యాంకు, టీ. నగర్ బ్రాంచ్ ఖాతాదారులే. సినిమా వాళ్ళు ఖాతాదారులవటం వల్ల ఆ రోజుల్లోనే వేలల్లో, లక్షల్లో నగదు లావాదేవీలు జరిగేవి. కాషియర్ రామారావు సునాయాసంగా చేత్తో సవ్యసాచిలా కాష్‌ని లెక్కించేవాడు. చేతి స్పర్శతో లెక్కపెడుతున్నప్పుడే చిరిగిన నోట్లు, దొంగ నోట్లు కూడా అలవోకగా పట్టుకునేవాడు. సుబ్రహ్మణ్యం మంచి పీ ఆర్.వో. అందరు ఖాతాదారులతో మంచి గావుంటూ పరిచయాలు పెంచుకునేవాడు. దత్తు (ఈయన నాకు గుర్తు వున్నంత వరకూ ఎం.పీ. మాగంటి అంకినీడు గారికి మేనల్లుడు వరస అవుతాడు) పూర్తి పేరు 'D.A.B.C'. దత్తు. ఆయన్ని అందరూ 'ABCD' దత్తు అనేవారు. మనిషి సౌమ్యుడు, మితభాషి. రాధాకాంత రావు కమ్యునిస్ట్ భావజాలం బాగా ఒంటబట్టించుకున్న మనిషి. అన్యాయాన్ని అస్సలు సహించేవాడు కాదు. విశ్వనాధరావుకి బ్రహ్మ చెముడు. కానీ గమ్మత్తు ఏమిటంటే ఖాతాదారులు మాట్లాడింది ఆయనకీ వినిపించకపోగా, పైగా వాళ్ళతో ఈయన బిగ్గరగా మాట్లాడేవాడు. సినీ మాయా బజార్‌లో ఓడలు బళ్ళు అవుతాయి, బళ్ళు ఓడలు అవుతాయి అన్నట్టు బాగా ఒక వెలుగు వెలిగిన వాళ్ళు అప్పులపాలై ఇబ్బందులు పడిన కళాకారులు ఎంతోమంది. నాకు తెలిసి ఆంధ్రా బ్యాంకు టీ.నగర్ సిబ్బంది చాలామంది తెలుగు చలన చిత్ర కళాకారులకి వ్యక్తిగతంగా చేతనైనంత ఆర్ధిక సాయం చేసి తమ మానవత్వాన్ని చాటుకునేవారు. అంధ్రా బ్యాంకు అన్న పేరుకి తగ్గట్టుగానే టీ. నగర్ అంధ్రా బ్యాంకు బ్రాంచ్‌లో ఆ రోజుల్లో చాలామటుకు తెలుగు భాష చలామణీ అయ్యేది. వేసవి శలవల్లో, శని, ఆదివారాల్లో నేను మా నాన్నతో బ్యాంకుకి వెళ్ళేవాడిని. మా నాన్న, ఇతర సిబ్బంది సేవింగ్ ఎకౌంటు లెడ్జర్లు బాలన్సింగ్ చేస్తూ వుంటే వాళ్ళతో పాటు తొమ్మిది, పది ఏళ్లు వున్న నేను కూడా ఒక లెడ్జర్ తీసుకుని కూర్చునే వాడిని. మా నాన్నగారు బాలన్స్ బుక్‌లో వరసగా అంకెలలో రెండు వరసలు కలిపి కూడిక చేస్తూవుంటే నేను ఆశ్చర్యంగా చూసేవాడిని. ఆవిధంగా నాకు పదేళ్లు నిండకుండానే నేను బ్యాంకులో పని చెయ్య టానికి అరంగేట్రం చేసాను. ఈ పునాది తదనంతరం నాకు 1986లో భారత్ ఓవర్సీస్ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరినప్పుడు బాగా ఉపయోగపడింది.

జూన్, 1968లో కే. గోపాలరావు అంధ్రా బ్యాంకు చైర్మన్‌గా నియమితు లయ్యారు. ఈయన ఇంతకు పూర్వం 13 ఏళ్లు ఇండియన్ బ్యాంకులో, 26 ఏళ్లు బ్యాంకు అఫ్ బరోడాలో పని చేసారు. ఈయన 1972 వరకూ అంధ్రా బ్యాంకు లో చైర్మన్‌గా వున్నారు. ఈయన పదవీ కాలంలో అంధ్రా బ్యాంకు చాలా శాఖలు పలు రాష్ట్రాలలో తెరిచారు. బ్యాంకు డిపాజిట్లు, రుణాలు ఈయన కాలంలో బాగా అభివృద్ధి చెందాయి.

**ఆంధ్రా బ్యాంక్‌ను ఇంకొక బ్యాంక్‌లో కలపడం తెలుగువాడిగా బాధాకరమైన విషయం. మా అకౌంట్లన్నీ ఆంధ్రా బ్యాంక్‌లోనే. ఇక్కడి టి.నగర్ బ్రాంచ్ స్టాఫ్ ఇంట్లో మనుషులుగా కలిసిపోయేవారు. నేను నావి వాటితో పాటూ మా నాన్నగారి అనుభవాలు రాద్దామనుకున్నాను. కాని నా బాల్యమిత్రుడు పార్ధు రాస్తాననేసరికి కాదనలేకపోయాను. దరిదాపు చెన్నై వాసుల అభిప్రాయాలన్నీ ఇలానే వుంటాయోమో. – జీవిరావ్**

1974–1977 కాలంలో తుని ఆంధ్ర బ్యాంకులో పనిచేశాక మా నాన్నగారు తీవ్ర ప్రయత్నం చేసి మళ్ళీ మద్రాసుకి బదిలీ చేయించుకున్నారు. టీ. నగర్ బ్రాంచ్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు. అప్పుడు బ్రాంచ్‌ని పాండిబజార్‌లోనే మా రామకృష్ణ స్కూల్‌కి ఎదురుగా వున్న బిల్డింగ్‌కి మార్చారు. కొంత కాలానికి మరల బ్రాంచ్ ని మా రామకృష్ణా స్కూల్ వరస లోనే డాక్టర్ గాలి బాలసుందరరావు గారి బిల్డింగ్‌కి మార్చారు. వీరు వైద్యులు మరియు రచయిత, సాహితీవేత్త. మధుర కళానికేతన్ అనే సంస్థని స్థాపించి తెలుగు నాటకాలని, సంగీతాన్ని ప్రోత్సహించేవారు. వీరి ఇంట్లోనే మినీ ఓపెన్ ఆడిటోరియం నిర్మించారు. ఒకసారి నరాల రామిరెడ్డి గారి అష్టావధానాన్ని నేను నా బాల్యంలో వీరి ఆడిటోరియంలో చూసే భాగ్యం కలిగింది. హాస్య నటులు శ్రీ పద్మనాభం గారి నాటక ప్రదర్శనలు కూడా ఈ ఆడిటోరియంలో చూసేవాడిని. ఈ ఆడిటోరియం పక్కనే రాణీ బుక్ సెంటర్ పేరుతో తెలుగు పుస్తకాల దుకాణం వుండేది. గాలి బాలసుందరరావుగారి కుమార్తె జలంధర గారు పేరుగాంచిన తెలుగు రచయిత్రి. విజయ నగరం నుంచి మా బంధువులు తరచూ తిరుపతి, మద్రాసు వచ్చేవారు. తిరుపతిలో వెంకటేశ్వర స్వామి దర్శనం అయినా కాకపోయినా మా బంధువులు మద్రాసులో ఉదయాన్నే ఎన్.టీ. రామారావు గారి దర్శనానికి టీ. నగర్‌లోని బజుల్లా రోడ్లో వారి ఇంటికి వెళ్ళేవారు. ఆ రోజుల్లో రామారావు గారిని చూడటానికి ఆయన అభిమానులు ఆంధ్ర రాష్ట్రం నుంచి బస్సుల్లో గుంపులు గుంపులుగా వచ్చే వారు. మా బంధువులు విజయా వాహినీ స్టూడియోకి వెళ్లి అక్కడ సినిమా షూటింగ్‌లో నటీనటుల్ని చూడాలని అనుకుంటే, వాళ్ళని మా నాన్నగారు వారించి టీ. నగర్ ఆంధ్రా బాంక్‌కి తనతో పాటు తీసుకుని వెళ్ళేవారు. మా బంధువులు బ్యాంకులో గంట సేపు కుర్చుని అక్కడ వచ్చే ఖాతాదారుల్లో తెలుగు చలన చిత్ర కళాకారులని దాదాపు అందరినీ తనివితీరా చూసి సంతోషించేవారు. అప్పట్లో మద్రాసు ఆంధ్రా బ్యాంకు వారు కళా వాహిని అనే సంస్థని స్థాపించారు. ఈ సంస్థ తరపున తెలుగు సినిమాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. ఈ సందర్భంగా అంధ్రా బ్యాంకు సిబ్బంది, వారి కుటుంబాలు తరచూ కలుసుకునే వారు.

మద్రాసులో టీ నగర్ అంటే తెలుగు వారికి వెంటనే గుర్తుకి వచ్చే ప్రదేశాలలో పాండి బజార్, పానగల్ పార్కులతో పాటు టీ. నగర్ ఆంధ్ర బ్యాంక్ కూడా ఒకటి. అటువంటిది 29 అగస్టన ప్రభుత్వం ఆంధ్రా బ్యాంకుని యునియన్ బ్యాంకు అఫ్ ఇండియాలో విలీనం చేస్తోందన్న వార్త వినగానే కొంత నిరుత్సాహం కలిగిన మాట వాస్తవం.మార్పు జీవిత సహజం. కొత్త నీరు వస్తే పాత నీరు కొట్టుకొని పోతుంది. ప్రవాహంతో పాటు మనం జీవిత సాగరంలో ప్రయాణం చేయక తప్పదు. అయినా పాత జ్ఞాపకాలు తీపి గురుతులుగా చిరకాలం మదిలో నిలిచిపోతాయి.

– బీ.యన్.వి. పార్ధసారధి

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**

# వృద్ధాప్యానికి ఆహ్వానం

– శ్రీ గొల్లపూడి మారుతీరావు

చమకం యజుర్వేదంలోని శ్రీరుద్రంలో ఒక భాగం. చమకంలో ఒకచోట – ఈ విచిత్రమైన కోరిక ఉంది. "వృద్ధం చమే, వృద్ధిశ్చమే" అని. ఇదేమిటి? నాకు వృద్ధినియ్యి అన్నంతవరకూ బాగానే వుంది. నాకు వృద్ధాప్యాన్ని యివ్వమని అడుగుతాడేమిటి? అని ఆశ్చర్యం. కోరికలనుంచీ, ఈ జీవితంలో సుఖాల నుంచీ బయటపడలేని జీవుడు – అలా బయటపడేసే మానసిక స్థితిని, ఆ దశని ప్రసాదించు స్వామీ – అంటూ ఆ కోరికల వెల్లువలోనే ఒక విచిత్రమైన కోరికని జతచేశాడు. అన్ని కోరికలనుంచీ విముక్తం చేసే – లేదా విరక్తిని కలిగించే వృద్ధాప్యాన్ని ప్రసాదించు –అని వేడుకోవడం బహుశా ఏ మతంలోనూ ఏ భక్తుడూ ఏ దేవుడినీ యింత పరిణతితో, యింత గంభీరమైన కోరిక కోరలేదేమో!

"ఈ మనస్సు కోతి స్వామీ! దానికి ఉన్న చాపల్యాలు అన్నీ తీర్చు. తప్పదు. చేసేదీ లేదు. కాని ఏదో ఒకనాడు ఈ చాపల్యాలన్నింటినీ వదులుకొనే దశనీ, స్థాయినీ, వయస్సునీ – వృద్ధాప్యాన్ని ప్రసాదించు" అంటున్నాడు జీవుడు.

వృద్ధాప్యం ఒక మజిలీ. ప్రతీ వ్యక్తీ కోరుకున్నా కోరుకోక పోయినా తప్పనిసరిగా చేరుకునే మజిలీ. వయస్సులోని కోరికలన్నింటికీ సెలవిచ్చి, అలసిపోయిన అనుభవాలనీ, ఆరిపోయిన అనుభూతులనూ నెమరువేసుకునే చలివేంద్రం. వృద్ధాప్యం ఒక అవకాశం. వెనక్కి తిరిగి చూసుకుని చేసిన తప్పిదాలకు నవ్వుకుని, దాటిన అడ్డంకులను పరామర్శించి, ఇక దాటనక్కరలేని స్థితికి వచ్చినందుకు ప్రశాంతంగా నిట్టూర్చే ఆటవిడుపు.

ముసిలితనం కొడుకు కంటె ఒక అడుగు వెనక నడిపిస్తుంది. మనవరాలి భుజాన్ని ఆసరా చేసుకుంటుంది. జీవితమంతా కొరుకుడుపడని నిజాలతో ఆనందంగా రాజీపడేటట్టు చేస్తుంది. పిల్లలు "నీకేం తెలీదు నాన్నా!" అంటే కోపం రాదు. ఒక జీవితకాలాన్ని తెలీనితనానికి తాకట్టు పెట్టిన కొడుకుని చూసి నవ్వుకుంటుంది. తనకి తెలీదని పక్కకి తప్పించే తరాన్ని చూసి గర్వపడుతుంది. అవలీలగా అర్థం చేసుకుంటుంది. "వాడికి తోచినట్టే చెయ్యనివ్వండి" అనే భార్య హితవుకి గంభీరంగా తలవొంచుతుంది. ఏ విమర్శా అవమానం అనిపించదు. ఏ నిందకీ కోపం రాదు.

వృద్ధాప్యాన్ని అందరూ గౌరవిస్తారు. నీ జీవితకాలంలో సాధనల్ని పక్కనపెట్టి కేవలం వయస్సు కారణంగానే పెద్దరికాన్ని అంగీకరిస్తారు. అదొక అంతస్థు.

అతని హితవుని నలుగురూ వింటారు. నీ ఆలోచనని గౌరవిస్తారు. దాన్ని పాటించరని అర్థమవుతున్నా కోపం రాదు. వయస్సు అర్థం చేసుకునే సంయమనాన్ని నేర్పుతుంది.

"మా రోజుల్లో..." అని చెప్పుకోవడంలో చిన్న 'సాకు'ని వృద్ధాప్యం మప్పుతుంది. "ఈ కాలం కుర్రాళ్లు..." అన్న వెక్కిరింతకి అరతని సంపాదించి పెడుతుంది. తన గురించి తన పెద్దలూ అలనాడు – అలాగే అనుకొని ఉంటారని అప్పుడు జ్ఞాపకం వస్తుంది.

వేసిన ప్రతీ అడుగూ తెలిసి వేసే నమ్మకాన్నిస్తుంది. చేసే ప్రతీ పనీ యిబ్బంది లేని, శ్రమ అనిపించని మార్గం వేపే ప్రయాణం చేయిస్తుంది. తన 'రేపు' క్రమక్రమంగా కురుచనయిపోతోందని అర్థమవుతూంటుంది. దక్కిన చిన్న తప్పుల్ని వృద్ధాప్యం భద్రంగా అలంకరించుకుంటుంది. "మనకి చేతకాదు" అని చెప్పడం పెద్ద అరతగా కనిపిస్తుంది. అసాధ్యానికి 'అనవసరం' అంటూ గడుసుదనం చిన్న ముసుగు వేస్తుంది. దానికి ఊతం వృద్ధాప్యం.

జీవితంలో చాలా ప్రశ్నలకు సమాధానాలు అర్థమవుతూంటాయి. ఇప్పుడా సమాధానాలకూ వేళ మించిపోయిందని అర్థమవుతుంది. ఈ సమాజంలో అవినీతి అనే కుళ్లు ఎప్పుడు తొలగుతుంది? ప్రతీక్షణం దోపిడీకి గురవుతున్న ఈ పర్యావరణం ఒక్కసారి ఎదురు తిరిగితే ఏమవుతుంది? ఏమయినా తనకేం బాధలేదు. ఆ సమయంలో తను ఉండదు. ఈ జీవిత నుంచి శలవు తీసుకోవడమే తనకి ఉపశమనం.

దేవుడు ఎక్కడ ఉంటాడు? ఎలా వుంటాడు? మృత్యువు తరువాత ఏమవుతుంది? సమాధానాలు అర్థమయే క్షణాలు దగ్గరవుతున్నాయి. చుట్టూవున్న జీవితాన్ని క్రమంగా ఖాళీ చేసుకుంటుంది వృద్ధాప్యం. చిన్నకేక తుళ్లిపడేటట్టు చేస్తుంది. చిన్న నిశ్శబ్దం ప్రశాంతంగా ఉంటుంది. ఎప్పటిలాగే తెల్లారి, వృద్ధులతో కలిసి నడిచి, రెండుముద్దల అన్నం తిని, అరగంట సేదతీరి, వేడి టీ తాగి, సాయంకాలం పార్కు బెంచీ దగ్గర "ఈ దేశం తగలడిపోతోంద'ని తిట్టుకుని, శాంతపడి – కీళ్లనొప్పులకు మాత్రలు మింగి, రాని నిద్రనీ, నిన్నటి జ్ఞాపకాలనీ నెమరు వేసుకోవడం –వృద్ధాప్యం వ్యసనం.

ఇప్పుడు విచారం దగ్గరకు రాదు. వెళ్లిపోయిన హితులూ, సన్నిహితులూ దిగులుగా జ్ఞాపకం వస్తారు. ముగింపు భయపెట్టదు. ఎందుకంటే భయపడినా రాకతప్పదు కనుక. అన్నిటినుంచీ, అందరినుంచీ తనని కుదించుకుని –మెల్లగా అంతర్ముఖుడు కావడం వృద్ధాప్యం.

ఇప్పుడు అన్ని దురదృష్టాలకూ కారణాలు అర్థమౌతాయి. చేసిన తప్పిదాలు, మాటతప్పిన కప్పదాట్లూ, మనసు నొప్పించిన చిన్న చిన్న జ్ఞాపకాల ముళ్లూ – అవన్నీ ఓ జీవితకాలం ఆలస్యంగా కళ్లముందు కదుల్తాయి. ఈ అనుభవాల్ని హెచ్చరికలు చెయ్యబోతే పిల్లలు వినరు. వినినట్టు నటిస్తారు. నటిస్తున్నారని తనకీ తెలుసు. విన్న తృప్తిని తానూ నటిస్తాడు. వారికీ వృద్ధాప్యం ఒకనాడు పాఠాలు చెప్తుందని తెలుసు. కాని వృద్ధాప్యం ఒక వరమని ఇప్పుడు చెప్పి ఒప్పించలేదు. వారు ఒప్పుకునే వేళకి తను ఉండదు. జీవితం ఎంత విచిత్రం! నవ్వుకుంటాడు. ఆ నవ్వు ఖరీదు ఒక జీవితం. 'చమకం' ఏ రుషి, ఏ మహానుభావుడు ఎప్పుడు సృష్టించారో –ఎంత ముందుచూపు, ఎంత వినయసంపద, జీవుని నిస్సహాయత, నిర్వేదం –అందులో నిక్షిప్తమయివుందో –ఆనాటి కోరిక సంపూర్ణమయిన స్వరూపంతో కళ్లముందు దర్శనమిచ్చేనాటికి –తాను జీవితమంతా కోరుకున్న 'వృద్ధాప్యం' తనని ఆవరించుకుని ఉంటుంది. ఈ దేశపు వేద సంపద, సాంస్కృతిక వైభవం, జాతి దర్శనం అపూర్వం, అనన్యసామాన్యం.

చమకంలో 'వృద్ధం చమే' అనే ఒక్క కోరికా ఈ జాతినీ, మతాన్నీ, ఆలోచనా స్రోతస్సునీ అత్యద్భుతంగా ఆవిష్కరించే అభిజ్ఞ. వరం. భగవంతుడిని కోరడంలోనే భగవంతుడు ప్రసాదించిన తన ఆలోచనా పరిణతిని అలంకరించే భగవద్దత్తమైన ఆశీర్వాదం. అదీ వృద్ధాప్యం. ●

## సర్వేజనా సుఖినో భవంతు
## లోకా సమస్త సుఖినో భవంతు

ఇలా కొన్ని వేల సంవత్సరాలుగా చెపుతూ వస్తున్న దేశమేదన్నా వుందంటే అది భారతదేశమే , జాతి ఏదన్న వుందంటే అది హిందూ జాతే , ఆ హిందువులలో పుట్టిన మహోన్నత యోగి, భారత యువ జనుల స్ఫూర్తిప్రదాత, ఏ రామకృష్ణ పరమహంస అనుంగు శిష్యుడు, యావత్ భారతీయులు గర్వించదగ్గ మహ నీయుడు స్వామి వివేకానంద, ఆయన అమెరికా లోని చికాగో నగరంలో సర్వమత సమ్మేళనంలో ప్రసంగిస్తూ నా ప్రియమైన సోదర సోదరీమణులారా అంటూ ప్రసంగం ప్రారంభించేసరికి ఆ హాలు చప్పట్లతో మారు మ్రోగిపోయిం దట. మనం తోటి మనుషులకు అంతటి విలువను ఇచ్చాం, ఇచ్చేవారం, ఇచ్చేస్తున్నాం. మన ప్లెడ్జ్ లోనే ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అంటూ సంబోధించమన్నాం. మన చరిత్ర చూస్తే మనం ఎవరిమీద దండెత్తలేదు, చాలామంది మనమీద దండెత్తారు, మనం సహనం వహించాం. వివేకనంద ఒక్కరే మాటకు మాట సమాధానం ఇచ్చారు, యువకుల మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సరిగ్గా ఈ సెప్టెంబర్ 2019 కి ఆయన చికాగో ప్రసంగానికి 125 ఏళ్ళు. ఆయన మన దేశీయుడైనందుకు గర్విద్దాం, ఆయన చెప్పిందాంట్లో పదవ వంతైనా పాటిద్దాం.



# తెలుగొచ్చురా నీకు ... ? అనడిగారు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు.... పురాణం గారిని ...

ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక ఎడిటర్గా పదవీ బాధ్యతలు స్వీకరించడానికి రైల్వేలో వుద్యోగం మానేసి... ఢిల్లీ నించి బెజవాడ వచ్చి... పెద్దాయన ఆశీర్వాదం కోసం ఆయన ఇంటికి వెళ్లినప్పుడు... ఈనేవన్నా తక్కువ వారా...?

చిన్న వయసులోనే (21 సంవత్సరాలు) గొప్ప కథ (నీలి) రాయడమే కాకుండా... ఆ కథని తీసుకునెళ్లి అంతర్జాతీయ వేదిక మీద సగౌరవంగా నిలబెట్టిన ఇద్దరే ఇద్దరయిన రచయితలలో ఈయన రెండవ రచయిత.

మొదటివారు శ్రీ పాలగుమ్మి పద్మరాజు గారు ...

1952 వ సంవత్సరంలో శ్రీ పాలగుమ్మి పద్మరాజు గారు రచించిన “గాలివాన” కథకి... నేషనల్ హెరాల్డ్ ట్రిబ్యూన్ వారు ... ఆంధ్ర సచిత్ర వారపత్రిక ద్వారా నిర్వహించిన “ప్రపంచ తెలుగు కథానికల పోటీలో బహుమతి లభించింది.

1953వ సంవత్సరంలో పురాణం గారి “నీలి” కథకి మొట్టమొదటి బహుమతి (100 రూపాయలు) లభించింది...

“నీలి” కథ ద్వారా తెలుగు సాహిత్యంలోనూ... సాహిత్యాభిమానులు గుండెల్లోనూ తనకంటూ ఒక ప్రత్యేకమైన ... సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు పురాణం గారు ... ఢిల్లీ సాహిత్య అకాడమీ వారి ఆహ్వానం మీద

“కా కా కాలేల్కర్” యాత్రా గ్రంధాన్ని తెనుగించారు.

అనుకోని ఈ హాటాత్పరిణామానికి మొదట కొంచం అప్సెట్ అయి నిమ్మళంగా తేరుకుని “నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా” అన్న చందంగా...

“మీరు నేర్పించిన తెలుగే కదా మాష్టారు” అని గడుసుగా సమాధానం చెప్పారు పురాణం...

పెద్దాయన నవ్వేసి గట్టివాడివే అని భుజం చరిచి బాగా చెయ్యి అని ఆశీర్వదించి పంపించారు...

Incidentally బెజవాడ SRR & CVR కాలేజీ లో చదువుకునేటప్పుడు మా నాన్నాగారికి...

మావయ్యకి విశ్వనాధ వారే తెలుగు బోధకులు...

ఆయన తెలుగు పాఠం చెబుతూంటే విద్యార్థులతో బాటు సహోధ్యాయులు ... ప్రిన్సిపాల్ గారితో సహా బుద్ధిగా చేతులు కట్టుకుని ... చెప్పులు విప్పేసి ..

చప్పుడుకు ఆయనకెక్కడ డిస్టర్బెన్స్ అవుతుందేమోనని కన్సర్న్... క్లాసు రూంలో చివర బెంచీలో కూచుని... కుచోటానికి చోట్లేకపోతే నిలబడే వుండి వినేవారట ఆయన పాఠం చెబుతున్నంత సేపూ..

ఆశ్చర్యంగా లేదూ... కానీ నిజం...

– బులుసు సాయిరాం

## నేను చదవవలసిన వాడినే కానీ చూడవలసిన వాడిని కాదురా

కవి సామ్రాట్టు విశ్వనాథ వారి మాట కరుకు, మనసు వెన్న అని అనడానికి ఒక చిన్ని ఉదాహరణ చాలు... ఓ రోజు ఓ కుర్రాడు విశ్వనాథ గారి ప్రతిభ విని ముగ్ధుడై ఓ రోజు ఆయన్ని చూడడానికి బందరు నుండి విజయవాడ వచ్చాడు. వారిని, వీరిని అడిగి తెలుసుకుని మొత్తానికి విశ్వనాథ వారిల్లు పట్టుకున్నాడు. అది అసలే ఎండాకాలం, అసలే బెజవాడ. ఓ ప్రక్క ఎండ మండిపోతోంది. మరో ప్రక్క చెమటలు. అలాగే ఆ ఇంటి తలుపు తట్టాడు. ఓ పెద్ద ముత్తైదువ వచ్చి తలుపు తీసింది.ఆ అబ్బాయి ”విశ్వనాథ సత్యనారాయణ గారున్నారా?” అని అడిగాడు. ఉన్నారు కూర్చోమని చెప్పి ఆవిడ లోపలికి వెళ్లి పోయింది. ఓ చిన్న అమ్మాయి వచ్చి మంచి తీర్థం ఇచ్చి కూర్చోండి అని చెప్పి వెళ్ళిపోయింది .

ఎంతసేపైనా లోపల్నుంచి ఎవరూ రాకపోయేసరికి అతనే గుమ్మం దగ్గరికి వెళ్లి లోపలికి తొంగి చూసాడు. వంటిల్లు కనబడింది. ఎండాకాలం ఆవకాయ సీజను కదా... దానికోసం లోపల పచ్చి మామిడికాయల రాసి పోసి వుంది. దాని ముందు కత్తిపీట పెట్టుకుని కూర్చుని ఒక పెద్దాయన కాయలు ముక్కలుగా తరుగుతున్నాడు.అసలే పెద్ద పేరు మోసిన కవి..ఇతను వాళ్ల ఇంటిలో వంటాయన కాబోలు అనుకున్నాడా అబ్బాయి. ఆ శ్రమకు, వేడికి బయిటకు వస్తున్న చెమటలు తువ్వాలుతో తుడుచుకుంటూ తరిగేస్తున్నారాయన..

ఈ అబ్బాయి ఇదిగో పెద్దయ్య గారూ అని ఆయన్ని పిలిచి విశ్వనాథ వారిని గురించి అడిగాడు. తరగడం ఆపి ఓసారి ఇతన్ని పరీక్షగా చూసి లోపలికి రమ్మని పిలిచారు. ఆ అబ్బాయి లోపలి వెళ్ళాడు.అక్కడ ఉన్న ఎత్తు పీట మీద కూర్చోమని సైగ చేశారు ఆయన. “నీ పేరేమిటి?” అని అడిగారాయన. చెప్పాడా అబ్బాయి. ఏం చదువుతున్నావంటే చెప్పాడు. ఊరు, పేరు, ఏం చేస్తుంటావు... మరి కాసేపు ప్రశ్నలు బందరు గూర్చి ఇలా ఒక్కొక్కటే అడుగుతుంటే అతనికి విసుగొచ్చింది. “ఇంతకీ విశ్వనాథ సత్యనారాయణ గారు ఎక్కడా?” అనడిగాడు.

“ఆయనతో నీకేం పని” అని ఎదురు ప్రశ్న వేసారు ఆ పెద్దాయన. “పనేం లేదు. ఊరికే చూసి పోదామని అంతే, అదంతా మీకెందుకు” అన్నాడా అబ్బాయి తాపీగా. ఆ పెద్దాయనకు కోపం ముంచుకొచ్చింది.. “వచ్చిన ప్రతీవాడికీ నేనేం ధర్మ దర్శనం ఇస్తానని చెప్పలేదు. నన్నేం చూస్తావు నా పిండాకూడు. ఎలాగూ ఇంత దూరం వచ్చావు. నాలుక్కాయలు తరిగేసి పో నాక్కాస్త సాయం చేసినట్లేనా వుంటుంది” అని గయ్యిమన్నారు. దాంతో ఆ అబ్బాయికి ఆయనే విశ్వనాథ వారని అర్థమయింది. వెంటనే ఆయన్ని క్షమించమన్నాడు ఆ అబ్బాయి. అంతే ఆ మహానుభావుడి మనసు వెన్నలా కరిగిపోయింది. ఆ అబ్బాయిని లేవదీసి... “ఒరేయ్ లేరా అబ్బాయీ... నువ్వేదో కష్టపడి నన్ను చూడాలని ఆతృతతో వచ్చావు గానీ నేను చదవవలసిన వాడినే కానీ చూడవలసిన వాడిని కాదురా...జజ అని ఆ పూట మంచి భోజనం పెట్టి, తిరుగు ప్రయాణానికి టికెట్లకు డబ్బుందో లేదో అడిగి కనుక్కుని... సాహితీ తాంబూలంగా కొన్ని పుస్తకాలు ఇచ్చి పంపారుట.

– వీర నరసింహ రాజు

